వార్త

4 ఫిబ్రవరి, 2024

ఆదివారం



# మనచుట్టూ అంతులేని 'భూ' మాయ!







# 'జైలర్' సీక్వెల్‌లో నయనతార!




రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్‌కుమార్ 'జైలర్' సినిమా రూపొందించాడు. రమ్యకృష్ణ ముఖ్యమైన పాత్రను పోషించిన ఈ సినిమాలో తమన్నా ఒక పాటలో మెరిసింది. అలాంటి ఈ సినిమా సీక్వెల్‌కి రజనీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సినిమాలోని ఒక కీలకమైన పాత్ర కోసం నయనతారను సంప్రదిస్తున్నట్లుగా సమాచారం. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో నాలుగైదు సినిమాలు వచ్చాయి. మరోసారి 'జైలర్ 2' కోసం ఈ ఇద్దరు కలిసి కనిపించనున్నట్లు తెలుస్తోంది. 'జైలర్' సినిమాలో రజనీకి భార్య పాత్రలో రమ్యకృష్ణ కనిపించింది. నయనతార ఏ పాత్రలో కనిపించనుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొన్నది.

తారాతీరం

## 'గూఢచారి 2'లో బనిత సంధు?

అడివిశేష్ హీరోగా శశికిరణ్ టిక్కా దర్శకత్వంలో తెర కెక్కిన యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం 'గూఢచారి'. దీనికి సీక్వెల్‌గా పాన్ ఇండియన్ రేంజ్‌లో తెరకెక్కుతున్న సినిమా 'గూఢచారి 2'. ప్రస్తుతం శరవేగంగా షూటింగు జరుగుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాని వినయ్ కుమార్ నిరిగినీడి తెరకెక్కిస్తున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లింగ్ సినిమాని రానున్న 2025 సంక్రాంతి కానుకగా రానున్నట్లు సమాచారం. ఇందులో శేష్‌కి జోడీగా లండన్ భామ బనిత సంధు నటిస్తున్నారు.

## రానా-తేజ కాంబినేషన్‌లో మరో సినిమా?



తేజ దర్శకత్వంలో రానా కథానాయకుడిగా 'నేనే రాజు-నేనే మంత్రి' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. హీరోగా ఈ సినిమా రానాకి హిట్ ఇచ్చింది. అలాగే చాలాకాలం తరువాత తేజకి కూడా ఆ సినిమా విజయం అందించింది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో 'రాక్షసరాజు' అనే సినిమా రూపొందనున్నట్లు వార్తలు వినిపించాయి. ప్రస్తుతం అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. యాక్షన్, ఎమోషన్ ప్రధానంగా నడిచే కథ అని తెలుస్తోంది. ఫ్యామిలీ ఎమోషన్స్ బలంగా ఉంటాయట. ఈ చిత్రం బావ-బావమరిది కథ అని తాజా సమాచారం. బావమరిది పాత్రను రానా పోషిస్తుండగా, బావ పాత్ర కోసం మోహన్‌లాల్ సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆదివారం వార్త
4 ఫిబ్రవరి, 2024

## మంచి ముత్యాలు

సృష్టిలో ఉన్న అందాన్ని చూడగలిగినప్పుడు
దేవునిలో ఉన్న అందాన్ని చూడడం తేలిక అవుతుంది.

- బార్బోడోస్ అడ్వకేట్

## విషయ విశేషం

మార్కెట్లో కొత్తగా... 4
'సంఘీ'భావం....5
ఆదుకోని ఆరోగ్యశ్రీతో రోగుల ఇక్కట్లు
కవర్ స్టోరీ..6
మనచుట్టూ
అంతులేని 'భూ' మాయ!
ఆ ఊళ్లో అతనొక్కడే...11
ఈవారం కవిత్వం..12
స్వప్నశయ్య
ఎయిర్ ట్యాక్సీ!..14
మై'మరిపించే' ప్లాటినం నగలు....18
కథ.. 20
పెళ్లి చూపుల గోల
సాహిత్యం..23
అక్షర శరధి-దాశరథి రంగాచార్య
ఆశల మెట్లు..25
ఇంటికి వాస్తు దోషాలున్నాయా?...29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### డిటెక్టింగ్ రోబో



చూడటానికి పిల్లలు ఆడుకునే కారుబొమ్మలా కనిపిస్తుందిగాని, ఇది మందుపాతరలను పసిగడుతుంది. కొరియన్ విద్యార్థులు సుబిన్‌కిమ్, జిహూన పార్క్ 'వార్డెన్' పేరుతో ఈ మైన్ డిటెక్టింగ్ రోబోకు రూపకల్పన చేశారు. ఇది ఎగుడుదిగుడు రహదారులు, బాగా ఎత్తుపల్లాలు ఉండే కొండదారుల్లో కూడా నిర్దేశించిన మార్గంలో సునాయసంగా ముందుకు సాగిపోగలదు. దీని అడుగుభాగంలో మూవింగ్ అటాచ్‌మెంట్‌ను అమర్చడంతో దారిలో అడ్డొచ్చే గడ్డి, కలుపు మొక్కలను పీకిపడేస్తూ చకచక ముందుకు కదిలిపోగలదు. పగటివేళల్లోనే కాకుండా, రాత్రి కటికచీకట్లోనూ ఇది పనిచేయగలదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఈ రోబో మైన్‌డిటెక్టర్ మందుపాతరలను అమర్చిన ప్రదేశాలను అత్యంత కచ్చితంగా గుర్తించి, వెనువెంటనే ఆ సమాచారాన్ని యాప్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌కు చేరవేస్తుంది. కొరియన్ విద్యార్థులు ప్రస్తుతం దీనిని ప్రయోగాత్మకంగా రూపొందించారు. మరింత మెరుగుపరచిన తర్వాత దీనిని రక్షణ అవసరాల కోసం అందుబాటులోకి తేనున్నారు.

### జోక్స్..జోక్స్..

కొడుకు: నాన్నా! ICICI అంటే ఏమిటీ?
తండ్రి: ఓస్! అది కూడా తెలియదా? నేను చూశా..నేను చూశా..నేను..అని అర్థం.

...

టీచర్: రాజూ! నీకు తెలిసిన కళల పేర్లు చెప్పు?
రాజు: ఎదురింటి శశికళ, పక్కింటి చంద్రకళ...వెనకింటి సూర్యకళ..సార్!

...

భార్య: నిజం చెప్పండి మీకు పడ్డవే మూడు ఓట్లు. ఒకటి మీది..రెండవది నాది..మరి ఆ మూడో ఓటేసిన నంగనాచి ఎవరు? దాంతో నీకేంటి సంబంధం?

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# మార్కెట్లో కొత్తగా..

## కొత్త రేడియో



దేశంలో రేడియో సేవలు మొదలై వందేళ్లు దాటుతున్నా ఇప్పటికీ 'ఆకాశవాణి'కి అదే ఆదరణ కనిపిస్తున్నది. ఆల్ ఇండియా రేడియోతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఎఫ్ఎం చానెళ్ల రాకతో ఆయా ప్రసారాలను వినే శ్రోతల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. టీవీలు, ఇతర సామాజిక మాధ్యమాలు వచ్చినా..'రేడియో' అంటే క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. ఆ క్రేజీని దృష్టిలో పెట్టుకొని.. లోవే సంస్థ సరికొత్త రేడియోను తయారు చేసింది. అత్యాధునిక ఫీచర్లలో వస్తున్న ఈ రేడియో.. 60హెచ్ నుంచి 22000హెచ్ ఫ్రీక్వెన్సీ మధ్య సిగ్నల్స్‌ను అందుకుంటుంది. అంతేకాదు, వీ 5.0 బ్లూటూత్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌కు కరెక్ట్ చేసి..దీన్ని మ్యూజిక్ ప్లేయర్‌గానూ వాడుకోవచ్చు. ఒక్కసారి చార్జ్ చేస్తే 14 గంటలపాటు పాటలు వినొచ్చు. ఇందులో అనేక ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి.




## నొప్పుల్ని నివారించే బూట్లు

నిత్యం వాకింగ్, జాగింగ్‌లాంటి వ్యాయామాలు చేసేవారు సరైన బూట్లను ఎంపిక చేసుకోవాలి. తక్కువ బరువు ఉండటంతోపాటు చెమట పట్టకుండా ఉండాలి. ప్రఖ్యాత బూట్ల తయారీసంస్థ బ్రూక్స్..తాజాగా మార్కెట్లోకి తీసుకొచ్చిన 'లాంచ్ 10' బూట్లు ఈ కోవలోకే వస్తాయి. కాళ్లనొప్పులు, కండరాలు పట్టేయడంలాంటి సమస్యలను ఈ తేలికపాటి బూట్లు నివారిస్తాయి. జాగింగ్ సమయంలో ఎదురయ్యే మరో సమస్య..అధిక చెమట. ఎందుకంటే, వ్యాయామం చేసినంతసేపు బూట్లను ధరించాల్సి ఉంటుంది. కాబట్టి, కాళ్లకు గాలి ప్రసరణ బాగా జరిగేలా, అధిక చెమట, అసౌకర్యాన్ని నివారించేలా..ఈ బూట్ల తయారీలో బ్రీతబుల్ మెటీరియల్‌ను ఉపయోగించారు. వివిధరంగులు స్టైల్స్‌లోనూ దొరుకుతాయి. వ్యాయామం కోసమే కాదు రెగ్యులర్‌గా వాడేందుకు అనువుగా, అన్ని దుస్తులకూ నప్పేలా వీటిని తీర్చిదిద్దారు. కంఫర్ట్‌తోపాటు సపోర్ట్‌నూ అందించే ఈ బూట్ల ధర రూ.11,999.

## అద్దాలు ధరిస్తే అద్భుతమే

ఏఆర్ (అగ్మెంటెడ్ రియాలిటీ) గ్లాసెస్ ఓ సాంకేతిక చమత్కారం. అయితే, ప్రస్తుతం మార్కెట్లో ఉన్న వివిధ కంపెనీల ఏఆర్ గ్లాసులు బరువుగా, పెద్దవిగా ఉన్నాయి. దీంతో వాటికి ఆదరణ అంతగా లభించడం లేదు. దీన్ని గమనించిన రాకిడ్ సంస్థ..తేలికపాటి, చూడటానికి సాధారణ కళ్లద్దాల్లా ఉండేలా ఏఆర్ గ్లాసెస్‌ను తీసుకొచ్చింది. యూజర్ ఫ్రెండ్లీ డిజైన్‌తో వస్తున్న ఈ గ్లాసెస్ పెట్టుకుంటే చాలు. కళ్లముందు 215 అంగుళాల తెర ప్రత్యక్షమవుతుంది. దానిపై 3డీ సినిమాలు చూడొచ్చు, గేమ్స్ కూడా ఆడుకోవచ్చు.




## 'సంఘీ' భావం



# ఆదుకోని ఆరోగ్యశ్రీతో రోగుల ఇక్కట్లు

నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో అమలులోకి తెచ్చిన ఆరోగ్యశ్రీ ఆశించిన మేరకు ఫలితాలను ఇవ్వడం లేదు. నిధులు మంజూరు చేయకపోవడంతో నిరుపేదలకు ఆరోగ్యశ్రీ అందని ద్రాక్ష పండులా ఉంది. గతంలో కేవలం ప్రభుత్వ ఆసుపత్రులలో మాత్రమే సామాన్యులకు ఉచిత వైద్యసేవలు అందుబాటులో ఉండేవి. ఏదైనా తీవ్రమైన వ్యాధి, రుగ్మత వస్తే అధునాతన వైద్య సదుపాయాలు లేక నిరుపేదలు ఇబ్బందులు పడేవారు. ఈ తరుణంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ సమస్య పరిష్కారానికి వీలుగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. 2007వ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీన ఈ పథకాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. దీనితో సామాన్యులు కూడా ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని పొందే అవకాశం కలిగింది. మరోపక్క ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ఒత్తిడి కొంతమేర తగ్గింది. సుమారు దశాబ్దం పాటు ఈ పథకం విజయవంతంగానే అమలు జరిగినా క్రమేపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సమస్యలు తలెత్తాయి. ఈ పథకం అమలుకు ముందు ఏదైనా తీవ్రతరమైన వ్యాధి ఉంటే చికిత్స పొందేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి సిఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సహాయం అందేది. దీనికి స్థానిక ఎమ్మెల్యే నుంచి సిఫారసు లేఖ పొందడమే కాకుండా ప్రైవేటు ఆసుపత్రి నుంచి కొటేషన్ తీసుకుని ప్రభుత్వానికి సమర్పించాల్సి వచ్చేది. అన్ని రకాల పరిశీలనలు అయిన తరువాత నిధులు విడుదల అయ్యేవి. దీనికి చాలా సమయం పట్టేది. అత్యవరసంగా చికిత్స పొందాలంటే ఈ విధానం అందుబాటులో ఉండేది కాదు. ఆరోగ్యశ్రీ పథకం వచ్చిన తరువాత సామాన్యులకు ఉన్నత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. తెలుగు రాష్ట్రాలు రెండుగా విడిపోయిన తరువాత కూడా ఈ పథకం కొనసాగుతూ వస్తోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీకి చెల్లించే గరిష్ట మొత్తాన్ని ఏకంగా 25 లక్షల రూపాయలు చేశారు. తెలంగాణలో పది లక్షల రూపాయలకు పెంచారు. దీనివల్ల అనేక రోగాలకు ఉచితంగా చికిత్స పొందే అవకాశం కలిగింది. వ్యాధుల చికిత్సకు ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. ఒక్కొక్క చికిత్సకు ఒక్కో రేటు నిర్ణయించింది. ఈ రేట్లు తక్కువగా ఉండటంతో చాలా ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ పరిధి నుంచి తప్పుకున్నాయి. కొన్ని ఆసుపత్రులు కొన్ని రోగాలకు మాత్రమే చికిత్స ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. దీనితో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తమ వ్యాధికి ఏ ఆసుపత్రిలో చికిత్స అందుతుందో తెలియక అయోమయానికి గురౌతున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో ప్రసవాలను ఆరోగ్య శ్రీ ద్వారా చేయడానికి అంగీకరించాయి. అయితే అక్కడ చిన్నపిల్లల డాక్టరు ఉన్నా ఈ పథకం వర్తించదని స్పష్టం చేస్తున్నాయి. దీనితో తల్లి ఒక ఆసుపత్రిలో, పుట్టిన బిడ్డ మరో ఆసుపత్రిలో చికిత్స పొందాల్సిన దుస్థితి ఉంది. వ్యాధులు నిర్ణయించిన ధరలు కూడా వివాదాస్పదంగా ఉన్నాయి. ఏదైనా ఒక వ్యాధికి సుమారు 25 వేల రూపాయలు అవుతుంటే ప్రభుత్వం కేవలం 12 వేల రూపాయలు చెల్లించేందుకు ప్యాకేజీగా సిద్ధం చేసింది. అయితే ఈ డబ్బు శస్త్రచికిత్సకు సరిపోదని భావించిన ఆసుపత్రులు వాటిని చేయడం లేదు. కొందరు అంగీకారం తెలిపినా మిగిలిన డబ్బును రోగుల నుంచి వసూలు చేస్తున్నారు. 25 వేల రూపాయల్లో ప్రభుత్వం 12 వేలు ఇస్తే రోగి నుంచి మరో 13 వేలు వసూలు చేస్తున్నారు. చికిత్స అయ్యే వ్యయం సగానికి తగ్గడంతో కొందరు రోగులు గత్యంతరం లేక డబ్బు చెల్లించి చికిత్స చేయించుకుంటున్నారు. ఇక ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, పాత్రికేయులకు ఇజెహెచ్ఎస్ పథకాన్ని అమలు చేస్తున్నారు. దీనికి కూడా దాదాపుగా ఆరోగ్యశ్రీతో సమానంగా నిధులు విడుదల చేస్తున్నారు. ఈ పథకానికి రేషన్‌కార్డుతో సంబంధం లేకపోవడంతో ఉద్యోగులు, పాత్రికేయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు సకాలంలో ఆయా ఆసుపత్రుల బిల్లులు మంజూరు చేయకపోవడంతో సమస్యగా మారింది. ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని చాలా ఆసుపత్రులు ఆరోగ్యశ్రీని, ఇజెహెచ్ఎస్‌ను అనుమతించడం లేదు. కొన్ని సందర్భాల్లో బహిరంగంగానే ప్రైవేటు ఆసుపత్రుల సంఘం ఆరోగ్యశ్రీని, ఇజెహెచ్ఎస్‌ను నిలిపివేస్తున్నామని ప్రకటించారు. మళ్లీ ప్రభుత్వం జోక్యం చేసుకుని కొంత మొత్తం చెల్లించడంతో తిరిగి చికిత్సలు ప్రారంభిస్తున్నారు. ఎక్స్‌రే తీయాల్సి వచ్చినప్పుడు ఫిల్మ్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ఎక్స్‌రే తీసిన చిత్రాన్ని కంప్యూటర్ ద్వారా ఆయా డాక్టర్లకు పంపిస్తున్నారు. డబ్బు చెల్లించి చికిత్స చేసుకుంటున్న రోగులతో సమానంగా సౌకర్యాలు ఆరోగ్యశ్రీ, ఇజెహెచ్ఎస్ లబ్ధిదారులకు ఇవ్వడం లేదు. ఇజెహెచ్ఎస్ కార్డు కలిగిన వారి కోసం వెల్‌నెస్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రభుత్వం ఉచితంగా మందులు సరఫరా చేయడంతో లబ్ధిదారులకు ఎంతో వెసులు బాటుగా ఉండేది. బిపి, షుగర్‌తో పాటు నిత్యం మందులు వాడాల్సి వచ్చే రోగులు ఇక్కడకు వచ్చి హెల్త్ కార్డు చూపించి నెలకు సరిపడా మందులు తీసుకు వెళ్లే వారు. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వచ్చి ఔషధాలు తీసుకువెళ్లే వారు, మందుల సరఫరా సక్రమంగా లేకపోవడంతో వెల్‌నెస్ సెంటర్లు అలంకార ప్రాయంగా మారాయి. విద్యావైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాల్సిన ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవడంతో నిరుపేదలకు ఎంతో అండగా ఉండే ఆరోగ్యశ్రీ ఎండమావిగా మారింది. ఇకనైనా ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్‌లకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



మనచుట్టూ

# అంతులేని 'భూ' మాయ!

**నేడు అనేక సందర్భాలలో రియల్ ఎస్టేట్ అనే మాటను వింటూనే ఉన్నాము. నువ్వు ఏ వృత్తి చేస్తున్నావని కొందరిని ప్రశ్నించినప్పుడు రియల్ ఎస్టేట్ అని గొప్పగా చెబుతుంటారు. రియల్ ఎస్టేట్ అంటే సరళంగా చెప్పాలంటే అది కొంతకాలం పాటు రాబడికి హామీ ఇచ్చే మరొక పెట్టుబడి మార్గం.**

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ హాకీం జాని

కానీ దాని అర్థాన్ని లోతుగా పరిశీలిస్తే అనేక విషయాలు చెప్ప వలసి వస్తుంది. వాస్తవ ఆస్తిని నిజమైన ఆస్తి వాస్తవాస్తి అని కూడా అంటారు. వాస్తవ ఆస్తిని ఆంగ్లంలో రియల్ ఎస్టేట్ అంటారు. రియల్ అంటే నిజమైన అని ఎస్టేట్ అంటే ఆస్తి లేక సంస్థానం ఏ అర్థాలు ఉన్నాయి. వాస్తవ ఆస్తి అంటే భూమి, భవనాలు, దీనితోపాటు సహజ వనరులైన పంటలు, ఖనిజాలు, నీరుతో పాటు ప్రకృతి స్థిరాస్తి. రియల్ ఎస్టేట్ వ్యాపార వృత్తిలో భూమి, భవనాలు, గృహాలను కొనడం, అమ్మడం, అద్దెకు, లీజుకు ఇవ్వడం, తీసుకోవడం వంటివి జరుగుతుంటాయి. రియల్ ఎస్టేట్ ఒక ప్రత్యక్ష ఆస్తి. ప్రాచీన కాలంలో రియల్ ఎస్టేట్‌లాంటిదేమీ లేదు. ప్రజలు అడవుల నుండి ఆహారాన్ని సేకరించి, వేటాడి తినేవారు. వారు నీటి వనరుల సమీపంలో నివసించేవారు. స్వీయ-స్థిరమైన పద్ధతిలో జీవించేవారు. కానీ మానవులు పురాతన కాలం నుండి మధ్యయుగానికి, ఆధునిక యుగానికి పురోగమిస్తున్నప్పుడు, కొత్త జీవన విధానాలు ఉద్భవించాయి. ప్రజలు వ్యవసాయం ప్రారంభించిన తర్వాతే భూమిని కలిగి ఉండటం ఆవశ్యకతను గ్రహించారు. ఒకప్పుడు జమీందారీ వ్యవస్థ ఉండేది. దీని కింద కొంతమంది భూస్వాములు పెద్దమొత్తంలో భూమిని కలిగి ఉండేవారు. పాశ్చాత్యదేశాలలో పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ దెబ్బతినడంతో, ఆస్తిని సొంతం చేసుకోవడం, అద్దెకు ఇవ్వడం అనే భావన కూడా వచ్చింది. అది భారత ఉపఖండంలో ధోరణులను మరింత ప్రభావితం చేసింది. తద్వారా రియల్ ఎస్టేట్ పరిశ్రమ అమలులోకి వచ్చింది. కానీ ఇక్కడ ప్రధాన అంశం ఏమిటంటే వలస పాలన నుండి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మాత్రమే భారతదేశంలో రియల్ ఎస్టేట్ పరిశ్రమ అభివృద్ధి చెందింది. భారతీయ రియల్ ఎస్టేట్‌లో చారిత్రక క్షణాలు దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత బాగా అభివృద్ధి చెందిన గృహ, ఆస్తిరంగం ప్రాముఖ్యతను భారతదేశంలో సాధించిన ప్రధాన మైలురాళ్లు. 1966లో మహారాష్ట్ర రీజినల్ టౌన్ అండ్ ప్లానింగ్ యాక్ట్‌తో భారత ప్రభుత్వం ఈ దిశలో తీసుకున్న మొదటి ప్రధాన అడుగు ఈ రంగం ప్రారంభదశలో ఉన్నందున కఠినమైన నిబంధనలు లేని కారణంగా, పట్టణ ప్రాంతాలలో ఊహాగానాల కారణంగా దేశంలో ధరల పెరుగుదల కనిపించింది. సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను 1970 మార్చి 17న మహారాష్ట్రలో స్థాపించారు. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను 1970 ఏప్రిల్ 25న స్థాపించారు. ఆ తరువాత 1976లో అర్బన ల్యాండ్ (సీలింగ్ అండ్ రెగ్యులేషన్) చట్టం రూపొందించబడింది. నివాస అవసరాల కోసం మాత్రమే

కాకుండా పెట్టుబడిగా కూడా ప్రజలు ఆస్తిని కొనుగోలు చేయడానికి అనేక ప్రభుత్వసంస్థలు అభివృద్ధి చేయబడ్డాయి. ఆ మీదట ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హౌసింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లను కూడా స్థాపించారు. 2005 సంవత్సరంలో పరిశ్రమను మరింత బలోపేతం చేసేందుకు రియల్ ఎస్టేట్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అనమతించబడ్డాయి. 2000వ దశకం ప్రారంభంలో మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు కూడా రియల్ ఎస్టేట్ పరిశ్రమలో ప్రధాన భాగంగా పరిగణించడం జరిగింది. ఎందుకంటే వీటిని మెట్రో నగరాల్లో నిర్మించారు. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు 2014లో ప్రారంభించారు. అన్యాయమైన పద్ధతులను నియంత్రించడానికై కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల ప్రయోజనాలను రక్షించడానికి రియల్ ఎస్టేట్ నిబంధనల, అభివృద్ధి చట్టం 2017లో అమలులోకి వచ్చింది.

రియల్ ఎస్టేట్ పరిశ్రమ భాగాలు బయటి నుండి చూస్తే, రియల్ ఎస్టేట్ పరిశ్రమ ఆస్తిని కొనడం, అమ్మడం వరకే పరిమితం అనిపించవచ్చు. అయితే ఇందులో ఇంకా చాలా ఉన్నాయి. ఇళ్లు, కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటళ్లు, ఆసుపత్రులు వంటి పెద్దపెద్ద భవనాల నిర్మాణాలు అన్నీ నిర్మాణ పరిధిలోకి వస్తాయి. ఈ భాగం రియల్ ఎస్టేట్‌ను అభివృద్ధి చేయడం, ఇప్పటికే ఉన్న రియల్ ఎస్టేట్‌కు విలువను జోడించడంతో ముడిపడి ఉంది.



బ్రోకరేజ్, ఏజెంట్లు పరిశ్రమలోని ఈభాగం రియల్ ఎస్టేట్ డిమాండ్, సరఫరాపై ఆధారపడి పనిచేస్తుంది. పెట్టుబడిదారులకు అత్యంత సముచితమైన ఆస్తులను అందించడం ద్వారా వారు కొనుగోలు, అమ్మకం లావాదేవీలను సులభతరం చేస్తారు.

## రియల్ ఎస్టేట్ రకాలు

**రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్:** ఒకే కుటుంబానికి చెందిన గృహాలు, డ్యూప్లెక్స్‌లు, టౌన్‌హోమ్‌లను కలిగి ఉండే ఆస్తి ప్రాథమికంగా నివాస ప్రయోజనాల కోసం ఉపయోగించబడేది ఈ వర్గంలోకి వస్తుంది. విలువ పెరిగినప్పుడు మీ ఆస్తిని అద్దెకు ఇవ్వడం లేదా విక్రయించడం ద్వారా మీరు అధిక రాబడిని పొందవచ్చు. నివాస విభాగానికి చెందిన రియల్ ఎస్టేట్ ప్రజలకు నివాసం కల్పించడంతో పాటు దానిలో నివసించే వ్యక్తుల సంఖ్య, నివాస రకాన్ని బట్టి అనేక రకాలుగా ఉంటుంది.

**కమర్షియల్ రియల్ ఎస్టేట్:** అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు, గ్యాస్‌స్టేషన్లు, కిరాణాదుకాణాలు, ఆసుపత్రులు, హోటళ్లు, కార్యాలయాలు, పార్కింగ్ సౌకర్యాలు, రెస్టారెంట్లు, షాపింగ్ కేంద్రాలు, దుకాణాలు, థియేటర్లు వంటి వ్యాపార ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా ఉపయోగించే ఆస్తి. ఈ రకమైన రియల్ ఎస్టేట్ వాణిజ్య ప్రయోజనాల కోసం అంటే ఇక్కడ ప్రధాన లక్ష్యం ఆదాయం సంపాదించడం. ఇది వ్యాపార, వృత్తిపరమైన కార్యకలాపాలను నిర్వహించడం కోసం కావచ్చు.

కిరాణాదుకాణాలు, స్టేషనరీ దుకాణాలు, ఆసుపత్రులు, హోటల్స్, కంపెనీ కార్యాలయాలు, చార్టర్డ్ అకౌంటెండెంట్ కార్యాలయాలు ఇత్యాది వాటిని వాణిజ్య రియల్ ఎస్టేట్‌కు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

**పారిశ్రామిక రియల్ ఎస్టేట్:** తయారీ, ఉత్పత్తి, పంపిణీ, నిల్వ, పరిశోధన, అభివృద్ధి, కర్మాగారాలు, పవర్‌ప్లాంట్లు, గిడ్డంగుల కోసం ఉపయోగించే ఏదైనా ఆస్తి ఈ విభాగంలోకి వస్తాయి.

## పెరుగుతున్న అవసరాలు

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుంది. ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో మనం ముందుకు వెళుతున్నాం. ఇంకా పాతికేళ్ల సమయం ఉంది. ఆ సమయంలో రియల్ ఎస్టేట్ దేశంలో ఎలా ఉంటుంది అనే అంశంపై నైట్‌ఫ్రాంక్ ఇండియా 'ఇండియా రియల్ ఎస్టేట్ విజన్ 2047' పేరుతో నివేదికను రూపొందించడం జరిగింది. ఆ నివేదిక ప్రకారం 2047 నాటికి మనదేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో 5.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని వెల్లడించింది. ఇందులో రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ వాటి 3.5 ట్రిలియన్ డాలర్లు ఉంటుందని, పెరుగుతున్న జనాభా అవసరాలను బట్టి ఉపాధి కల్పిస్తున్న రంగం రియల్ ఎస్టేట్. ఇందులో దాదాపు 18శాతం మంది ఉపాధి పొందుతున్నారు. మనదేశంలోని 8 ప్రధాన నగరాల్లో కలిపి 2021లో 2.32 లక్షల ఇళ్ల విక్రయించారు. 2022లో 3.12 లక్షలకు విక్రయాలు పెరిగాయి. నగరాల్లో కార్యాలయాలకు డిమాండ్ పెరిగింది. వీటితోపాటు మాల్స్ కూడా ఎప్పటి నుండో ఉన్నాయి. మనదేశంలో తొలిమాల్ 1999లో ఢిల్లీలో వచ్చింది. ఆ తరువాత ముంబై, చెన్నై ఇలా అన్ని నగరాలకు మాల్స్ విస్తరించాయి. ఈ మాల్స్‌ను సౌకర్యాలను బట్టి ఏ.బి.సి ఇలా మూడురకాలుగా విభజించారు. ఇవన్నీ పరిశీలిస్తే రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లకు కూడా పెట్టుబడులు అధికంగా లభించే అవకాశం ఉందని సంబంధిత వర్గాల విశ్లేషకులు తెలియజేస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు, వ్యక్తిగత ఇళ్లు, విమానాశ్రయ మార్గాలు, ఆకాశహర్మ్యాల ప్రాజెక్టులు చేపడుతున్నారు. ఈవిధంగా పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రియల్ ఎస్టేట్ రంగం మరింత అభివృద్ధి చెందుతుంది.

## పలురకాల ఏజెంట్లు

రియల్ ఎస్టేట్ ఏజెంట్ రియల్ ఎస్టేట్ కొనుగోలుతో పాటు అమ్మకంతో సైతం ప్రత్యేకతను కలిగి ఉంటాడు. ఈ ఏజెంట్లను కొన్ని సందర్భాలలో బ్రోకర్లు అని కూడా పిలుస్తారు. వారు కొనుగోలుదారులు, అమ్మకందారుల మధ్య మధ్యవర్తిగా వ్యవహరిస్తారు. డీల్ విలువ ఆధారంగా వారు తమ సేవలకు కొంత మొత్తాన్ని వసూలు చేస్తారు.

**విక్రేత ఏజెంట్:** విక్రేత ఏజెంట్, ఆస్తి విక్రేత కోసం మాత్రమే పని చేస్తాడు. వారు విక్రేత ఆస్తి కొనుగోలుదారుల కోసం శోధిస్తారు.

**కొనుగోలుదారు ఏజెంటు:** కొనుగోలుదారు ఏజెంట్ కొనుగోలుదారు కోసం మాత్రమే పని చేస్తాడు. వారు ఉత్తమమైన ఆస్తిని ఎంచుకోవడంలో కొనుగోలుదారులకు సహాయం చేస్తాడు. ఏజెంట్లను నియమించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఆస్తిని కొనుగోలు చేయడం, విక్రయించడంలో సహాయపడటానికి రియల్ ఎస్టేట్ ఏజెంట్‌ను నియమించుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఆస్తిని విక్రయించేటప్పుడు ఉత్తమ కొనుగోలుదారుని

కనుగొనడంలో చాలా సహాయపడుతుంది. కొనుగోలు చేసేటప్పుడు ఉత్తమమైన ఆస్తిని ఎంచుకోవడానికి వీరు ఉపయోగపడతారు. ఆయా ప్రాంతాలతోపాటు మార్కెట్ గురించి కూడా ఏజెంట్లకు అవగాహనతో ఉంటుంది. ఆస్తి లావాదేవీలను ఎలా ఎదుర్కోవాలో వారికి బాగా తెలుసు. తప్పుడు ఆస్తిలో పెట్టుబడి పెట్టకుండా ఏజెంట్ కాపాడగలదు. ముఖ్యంగా సమయం ఆదా అవుతుంది.



## రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టడం వల్ల కలిగే లాభాలు

ప్రస్తుత రోజుల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఏ స్థాయిలో దూసు కెళ్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ వ్యాపారంలోకి నిత్యం వందల మంది వస్తున్నారు. అయితే స్థిరాస్తి వ్యాపారంతో సంపద పెంచుకోవడానికి కొన్ని పాటించాల్సిన పద్ధతులు ఉంటాయి. ప్రైవేటు పెట్టుబడుల్లో ఎక్కువ లాభాలు అందించేది మాత్రం రియల్ ఎస్టేట్ బిజినెస్ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. చాలా తక్కువ సమయంలోనే ఎక్కువ సంపద సృష్టిస్తుంది. ఆస్తి విలువ పెరగడం, దీర్ఘకాలంలో ప్రాపర్టీ ధరలు పెరుగుతుండడం, పెట్టుబడిదారుల పోర్ట్‌ఫోలియోను డైవర్సీ‌పై చేయడానికి ఉపయోగించడంతో ఈ వ్యాపారం మంచి ఆదాయ మార్గంగా మారిందని చెప్పాలి. ఇతర వృత్తులు చేయకుండా మీరు స్థిరమైన ఆదాయాన్ని సంపాదించవచ్చు. కొన్ని అసాధారణ పరిస్థితులను మినహాయించి భవిష్యత్తులో స్థిరాస్తి ధరలు పెరగడం ఖాయం. ఈరోజు ఆస్తిని కొనుగోలు చేసి, రెండేళ్ల తర్వాత విక్రయిస్తే మీరు కచ్చితంగా అధిక మొత్తంలో తిరిగి పొందుతారు. రియల్ ఎస్టేట్ విలువ మాత్రమే కాదు, దాని నుండి వచ్చే ఆదాయం కూడా కాలక్రమేణా పెరుగుతుంది. మీరు సంపాదించే ప్రతి ఆదాయం కొంతవరకు పన్ను విధించబడుతుంది. కానీ ఆస్తి నుండి వచ్చే ఆదాయం విషయానికి వస్తే, ఇది మీకు గరిష్ట పన్ను ప్రయోజనాన్ని ఇస్తుంది. ఇతర ఆదాయ వనరులతో పోలిస్తే అటువంటి ఆదాయంపై మీరు తక్కువ పన్ను చెల్లిస్తారు.

## కోల్పోతున్న పచ్చదనం

ప్రజలు నివసించడానికి ఇళ్లు అవసరం అనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ వీటి నిర్మాణం కోసం చాలా సందర్భాలలో పచ్చని చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేస్తున్నారు. నరికిన చెట్ల స్థానంలో తిరిగి మొక్కలను నాటని కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిని కాలుష్యం పెరిగిపోతుంది. కొన్ని సందర్భాలలో పంటభూములను సైతం ధన సంపాదన కోసం వెంచర్లు వేసి భవంతులు నిర్మిస్తున్నారు. ఇదే కొనసాగితే మున్ముందు ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుంది. రియల్ ఎస్టేట్ కోసం ఆరావళిలోని అటవీ ప్రాంతంలో 60 వేల ఎకరాల అటవీ విస్తీర్ణాన్ని కోల్పోవడం జరిగింది. గుర్గావ్ ఇప్పుడు చెట్ల అడవి కాదు. అది కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయింది. ఇక్కడ మనకు చెట్లు కనిపించవు. ఇలా అభివృద్ధి పేరుతో వేలాది చెట్లను నరికిన సందర్భాలున్నాయి. దక్షిణ ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ గృహ ప్రాజెక్టుల పునరాభివృద్ధి కోసం 17 వేల చెట్లను నరికివేయాలని ఒకప్పుడు ప్రతిపాదించారు.



సరోజినీ నగర్, నౌరోజీ నగర్‌తో పాటు చుట్టుపక్కల ఏడు పరిసరాల్లో ప్రభుత్వ అధికారుల ఇళ్లు, వాణిజ్య సముదాయం కోసం ప్రభుత్వ యాజమాన్యంలోనిరియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ బాడీ అయిన నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్(ఎన్‌బిసిసి)లో భాగంగా చెట్లను నరికివేయాల్సి ఉంది. చెట్లను నరికివేయడాన్ని నిరసిస్తూ, నిరోధించడానికి ఢిల్లీవాసులు, పర్యావరణ కార్యకర్తలు ఆధునిక 'చిప్కో ఉద్యమం' ప్రారంభించారు. వాయు కాలుష్యం కారణంగా ఏటా దాదాపు 25 లక్షల మంది చనిపోతున్నారు. రెండేళ్ల పిల్లాడు దానివల్ల చనిపోతే ఈ అభివృద్ధి వల్ల ప్రయోజనం ఏమిటి? అని ప్రశ్నిస్తున్నవారు లేకపోలేదు. చెట్లను నరికినట్లైతే వాటి స్థానంలో అదనంగా చెట్లనే నాటాలనే నియమం ఉంది. ఆ నియమాలను పాటించని సంఘటనలు అనేకం ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కోసం కొండలను సైతం పిండి చేయడమే కాక కొన్ని కొండల శిఖరాలను చదును చేసి ప్లాట్లు చేసి అమ్మేశారు. ఈ ప్రక్రియలో 7.5 హెక్టార్ల విస్తీర్ణంలో చెట్లను నరికివేశారు. ఈ విషయంపై ఫిర్యాదులు రావడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ జరపాలని కోరింది. అయితే చట్టవిరుద్ధమైన ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు తక్కువ అని చెప్పాలి. ఇందుకు ప్రధాన కారణం వారికి రాజకీయ అండబలం, అర్థబలం ఉండటమే అనేది బహిరంగ రహస్యమే. పగటిపూట చెట్ల నరికితే జనం నుండి వ్యతిరేకత వస్తుందని రాత్రికి రాత్రే అత్యాధునిక యంత్రాలతో వేలకొద్ది చెట్లను నరికిన సందర్భాలు లేకపోలేదు. కొన్ని ప్రాంతాలలో తాటి, ఈత, ఖర్జూరం చెట్లు నరకడం వల్ల వేల సంఖ్యలో గీతకార్మికులు ఉపాధిని కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలా చెట్లు నరికే వారిపై కఠిన చర్యలు తీసుకుని నరికిన చెట్ల స్థానంలో రెట్టింపు మొక్కలను నాటి, వాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడవలసిన ఆవశ్యకత ఉంది.

## రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టడం వల్ల వచ్చే నష్టాలు

రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకోవడం, అత్యంత అనుకూలమైన ఆస్తిని ఎంచుకోవడం, అవసరమైన నిధులను సేకరించడం, యాజమాన్యాన్ని బదిలీ చేయడం.. వీటన్నిటికీ చాలా సమయం పడుతుంది. మొత్తం ప్రక్రియ కొన్నిసార్లు దుర్భరమైనదిగా చెబుతుంటారు. రియల్ ఎస్టేట్‌లో మోసాలు రియల్ ఎస్టేట్ ఎంతో మంది జీవితాలను నిచ్చెనలు ఎక్కిస్తుంటే అది చూసి ఉజ్వల భవిష్యత్తును ఊహించుకున్న మరెంతో మంది అగాథంలో కూరుకుపోతున్నారు. సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నవారు కొందరైతే, మంచి లాభాలు ఇస్తుందన్న నమ్మకంతో మరికొందరు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. ఆ తరువాత ఇక్కడ జరిగే మోసాలకు బలౌతున్నారు. ఈ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రియల్ ఎస్టేట్‌లో ట్రెండ్ వెంట పరుగులు పెడుతూ ఆయా లావాదేవీలకు ముందు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా నష్టపోతున్నవారూ ఉన్నారు. ఇదే సమయంలో మోసగాళ్లు కొత్త కొత్త రకాలుగా వినియోగదారులను మోసగిస్తున్నారు. పెద్ద పెద్ద కంపెనీలలో ఒక రకమైన మోసాలు జరుగుతుంటే, క్షేత్ర స్థాయిలో చిన్న బ్రోకర్లు చేసే మోసాలు మరో విధంగా ఉంటాయి. వెంచర్లు వేసి, సగం మొత్తం చెల్లించి మిగిలింది వాయిదాల పద్ధతిలో ఇవ్వవచ్చని నమ్మబలికి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా ప్రజలకు కుచ్చుటోపీ పెట్టిన సంఘటనలు కోకొల్లలు. పైగా ఈ వెంచర్ పక్కనే ప్రముఖుల ఇళ్లు రాబోతున్నాయి, పాఠశాలలు, ఆసుపత్రులు, రవాణా సౌకర్యాలు అతి త్వరలో వచ్చేసి శరవేగంతో ఈ ప్రదేశం అభివృద్ధి చెందబోతుంది అని కళ్లకు కట్టినట్లు కాకమ్మ కబుర్లు చెబుతూ వడ్డించిన విస్తరి అని నమ్మబలుకుతున్నారు. ప్రజలు నమ్మి సగం డబ్బును చెల్లిస్తున్నారు. మోసపోయిన తరువాత ప్రజలు కళ్లు తెరిచి ఇది పంచభక్ష పరమాన్నాలతో వడ్డించిన విస్తరి కాదు, ఇక్కడ పచ్చడి మెతుకులు కూడా లేవు అని తెలుసుకునేటప్పటికి వెంచర్ వేసిన సంస్థ జెండా పీకేసి ఉడాయిస్తున్నారు. ఇక అడ్వాన్స్‌లు చెల్లించినవారు సంవత్సరాల పాటు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగలేక బలైపోతున్నారు. కొందరు రాజకీయ నాయకులు ఈ రంగంలో ఉండటం వల్ల పలుకుబడితో వారు ఎటువంటి మోసాలు చేసినా చలామణి అవుతుంది. చివరకు ప్రజలు నష్టపోతున్నారు.



## యాజమాన్య హక్కులు

యాజమాన్య హక్కులు లేకపోయినప్పటికీ సంబంధిత స్థలం, ఫ్లాట్ అమ్మడం మనం చూస్తూనే ఉన్నాం. పవర్ ఆఫ్ అటార్నీ కూడా ఈ కోవలోకే వస్తుంది. వారంతట వారే పవర్ ఆఫ్ అటార్నీ క్లైమ్ చేసుకొని స్థలాన్ని అమ్ముతారు. వాస్తవానికి సుప్రీంకోర్ట్ ఈ పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా అమ్మకాలను సమ్మతించలేదు. అలాగే కోర్టు వివాదాలు, ఇతర వివాదాల్లో నలుగుతున్న భూములను కూడా అమ్మజూపుతారు.

## హడావుడి అమ్మకాలు

ప్రీలాంచ్ పేరుతో చేసే అమ్మకాలు ఈ కోవలోకి వస్తాయి. కొంతమంది స్థలానికి అడ్వాన్స్ ఇచ్చింది మొదలు ప్రీలాంచ్ పేరుతో అమ్మకాలు సాగిస్తారు. వాస్తవానికి వారు కొన్న స్థలం పూర్తిగా చట్టబద్ధంగా ఎలాంటి చిక్కులు లేనిదేనా? ఒకవేళ ఉంటే కొన్న స్థలంలో వారి ప్రణాళిక ప్రకారం భవనం నిర్మించేందుకు అనుమతులు లభిస్తాయా? సంబంధిత నగర మాస్టర్ ప్లాన్ నిబంధనలను ఈ స్థలం సంతృప్తి పరుస్తుందా? ఇలాంటి అంశాలన్నీ ఆలోచించకుండా కొనుగోలుకు సిద్ధమవుతారు. పైగా ఒక నిర్దిష్ట తేదీ పెట్టి బిల్డర్ల హడావుడి చేస్తారు. అయ్యో.. ఇలాంటి అవకాశం మళ్లీ దొరుకుతుందో? లేదో? అని దానిని కొనేందుకు మొగ్గు చూపుతారు. ఒకవేళ ఆ బిల్డింగ్‌కు అనుమతులు రాకపోయినా, సంబంధిత స్థలంపై ఏవైనా వివాదాలు ఉన్నా వినియోగదారులు నష్టపోతారు. ఒకవేళ అందులో ఏవైనా ఆక్రమణలు ఉండొచ్చు. అసైన్డ్ లాండ్స్ ఉండొచ్చు. పక్కన నీటి వనరులు ఉన్నప్పుడు కొన్ని ఆంక్షలు ఉంటాయి.

## ప్రతిఫలంపై ఆశలు

కొంతమంది బిల్డర్లు ఫలానా అపార్ట్‌మెంట్‌పై ఇంత కాలం తరువాత 15 శాతం, 20 శాతం ప్రతిఫలం వస్తుందంటూ ఆశ పెడతారు. అయితే భవిష్యత్తుపై అంచనాలు లేకుండా వీటిలో గుడ్డిగా పెట్టుబడులు పెట్ట రాదు. ముఖ్యంగా కమర్షియల్ వెంచర్లలో ఇలా చేస్తారు. అప్పు తెచ్చి ఇలాంటి వాటిలో పెట్టుబడి పెట్టడం ఎంతమాత్రం సరికాదు.

## పొసెషన్‌లో జాప్యం

రియల్ ఎస్టెట్‌లో ఇదో తరహా మోసం. హైదరాబాద్‌లో అనేకమంది వినియోగదారులు ఈ సమస్య ఎదుర్కొన్నారు. ఢిల్లీ, నోయిడా, గుర్‌గ్రామ్ వంటి నగరాల్లో అనేక మంది కోర్టులను ఆశ్రయించారు. మీరు అపార్ట్‌మెంట్ లేదా విల్లా కొనే ముందు ఆయా బిల్డర్లపై రివ్యూలను చదివితే అర్థమవుతుంది. వారు అంతకు ముందు ఎలాంటి మోసాలకు పాల్పడ్డారో తెలుస్తుంది. కొన్ని భవన నిర్మాణాలు ఏళ్లకు ఏళ్లు జాప్యం చోటు చేసుకుంటాయి. మీరు అప్పు తెచ్చి చెల్లించిన మొత్తానికి మీరు వడ్డీ కడుతూ పోతుంటారు. కానీ ఈ నిర్మాణాలు పూర్తి కావు. ఇలాంటి సందర్భాల్లో మీరు ఆర్థికంగా నష్టపోతారు.



## రద్దు చేసుకోమని ఒత్తిళ్లు

బిల్డర్లు తమ వద్ద డబ్బు లేనప్పుడు పెట్టుబడులు సమీకరించుకోవడం కోసం ఇలాంటి మోసాలకు పాల్పడ్డారు. మీరు పెట్టే పెట్టుబడికి బదులుగా ప్లాటు ఇస్తామని నమ్మించవచ్చు. కానీ వారి ఆర్థిక పరిస్థితి మెరుగై, మార్కెటింగ్ పూర్తయ్యాక మీకు ఫ్లాటు రిజిస్ట్రేషన్ చేసేందుకు నిరాకరించవచ్చు. ఒకవేళ ఇందుకు సంబంధించి ఏదైనా ఒప్పందం చేసుకుని ఉంటే దానిని రద్దు చేసుకోమని ఒత్తిళ్లు తేవొచ్చు. ఫినిషింగ్ చేసి ప్లాట్లు ఇస్తామని కేవలం గోడలు కట్టి మీకు అంటగట్టవచ్చు. ఆ తరువాత ఆ ఫ్లాట్‌కు కబోర్డులు, రంగులు, డెకరేషన్లు, బాత్రూమ్‌లో హంగులు ఇవన్నీ ఏర్పాటు చేసుకోవడానికి లక్షలు ఖర్చవుతాయి.

## ప్లాన్ ప్రకారం లేకపోవచ్చు

మీకు ముందుగా చూపించిన ప్లాన్ ప్రకారం ఫ్లాటు లేకపోవడం, ఎమినిటీస్ లేకపోవడం, హామీ ఇచ్చిన మేరకు నాణ్యమైన పరికరాలు, సామగ్రి, మెటీరియల్ వినియోగించకపోవటం వంటి మోసాలకు కొందరు బిల్డర్లు పాల్పడవచ్చు. మన ఇంటి పక్కన అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతున్న సందర్భాలలో బిల్డర్‌లు మన వద్దకు వచ్చి మీ స్థలం ఇస్తే రెండు ఫ్లాట్లు ఇస్తామని ఆశ చూపుతారు. వారు చెప్పినట్లు చేసినవారు చాలా మంది ఉన్నారు. ప్లాన్ ప్రకారం అనుమతి వచ్చిన ఫ్లాట్‌లను బిల్డర్ ఉంచుకుని, అనుమతిలేని ఫ్లాట్‌లను స్థలం ఇచ్చిన వారికి అంటగట్టిన సంఘటనలు ఉన్నాయి. ఇక ప్రభుత్వ అధికారులు వచ్చి అనుమతి లేని ఫ్లాట్‌వారిని వేధించడంతో మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకున్నవారు కూడా లేకపోలేదు.

ఒకే యూనిట్‌ను ఒకరికి మించి అమ్మడం సాధారణంగా స్థలాల విషయంలో ఇలాంటి మోసాలు ఎదురవుతాయి. ఒకే స్థలాన్ని ఒకరికి అమ్మి, అదే స్థలాన్ని మరొకరికి అమ్ముతారు. ఇలా మోసగించి చివరకు సెటిల్‌మెంట్ అంటూ కుచ్చుటోపీ పెడతారు.

నేడు రియల్ ఎస్టేట్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఓ ఫ్లాట్ చేసి అందులో సొంత ఇళ్లు నిర్మించుకోవాలని సామాన్య, మధ్య తరగతి ప్రజల అమాయకత్వాన్ని కొందరు రియల్ వ్యాపారులు, బ్రోకర్ల ఆసరాగా చేసుకుంటున్నారు. ప్లాట్ల విక్రయాల్లో



స్కీంలను పెట్టి తక్కువ ధరకే ప్లాట్ ఇస్తామని నెల నెలా వాయిదా పద్ధతిలో డబ్బులు చెల్లిస్తే సరిపోతుందని అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి వెంచర్ చేయకుండానే కేవలం మ్యాప్ పైనే ప్లాట్లను చూపిస్తూ నమ్మబలికిస్తూ కోట్లాది



రూపాయలను వసూలు చేస్తూ కొందరురియల్ వ్యాపారులు, బ్రోకర్లు మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా లేఅవుట్‌లు తీసుకోకుండా, కనీస సౌకర్యాలు కల్పించకుండానే అమాయక ప్రజలకు ప్లాట్లను అంటగడుతున్నారు. ఈ రియల్ మోసాలు ప్రైవేట్, ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల్లో అక్రమ వెంచర్లు చేస్తూరియల్ వ్యాపారులు భూ దందా సాగిస్తున్నారు. పట్టణాల్లోనూ లే-అవుట్లు లేకుండానే పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలుస్తున్నాయి. ఈ అక్రమ వెంచర్ల ఏర్పాటు సంబంధిత కొందరు అధికారులు సైతం ముడుపులు స్వీకరించి కిమ్మనకుండా కూర్చుంటున్నారనేది సర్వవిదితమే. లే-అవుట్ లేకుండానే ప్లాట్ల విక్రయాలు, స్కీమ్‌ల పేరిట ప్లాట్లను అమాయక ప్రజలకు అంటగడుతున్న బ్రోకర్లు, ఆకర్షణీయమైన బ్రోచర్ల పైనే ప్లాట్లు చూపిస్తుంటారు. లక్షల్లో డబ్బులు వసూలు చేసి వెంచర్లలో మాత్రం ప్లాట్లు చూపించరు. కనీస సౌకర్యాలు కరువు కావడంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. అక్రమార్కులకు కొన్ని రాజకీయ పార్టీ నేతల అండ ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరు చేసిన మోసాలను అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ బాధితులు విలపిస్తున్నారు.

ఎలాంటి అనుమతులు లేకుండా రియల్ వ్యాపారులు అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తూ లే అవుట్ ప్లాట్లు అమాయక ప్రజలకు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ శాఖల నుంచి అనుమతులు తీసుకోకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి సైతం గండి పడుతోంది. వెంచర్లు ఏర్పాటు చేయాలంటే ముందుగా భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలి. నాలా అనుమతి కోసం సంబంధిత ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత మున్సిపల్, గ్రామ పంచాయతీ 10 శాతం భూమి రిజిస్ట్రేషన్ చేయించి మరో 40 శాతం భూమిని వెంచర్‌లో రోడ్లు, విద్యుద్దీకరణ, మురుగు కాలువలు, నీ ట్యాంకులు, కమ్యూనిటీ హాళ్లకు కేటాయించాలి. అనంతరం మున్సిపల్ టౌన్ ప్లానింగ్, గ్రామ పంచాయతీ సిఫార్సులతో డీటీసీపీవో (డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్) అనుమతితో తిరిగి గ్రామ పంచాయతీల నుంచి ఎన్‌వోసీ పత్రం పొందాలి. ఇందుకు మున్సిపల్, గ్రామ పంచాయతీకి లే-అవుట్ రుసుం కూడా చెల్లించాల్సి ఉంటుంది. కానీ రియల్ వ్యాపారులు వెంచర్లు చేసే సమయంలో ప్రభుత్వానికి నయా పైసా కట్టకుండా, మున్సిపల్, గ్రామ పంచాయతీకి స్థలాన్ని వదలకుండా ఇష్టానుసారంగా ప్లాట్లు చేసి విక్రయాలు చేస్తున్నారు. ఇటువంటి వాటిని ప్రజలు గమనించి మోసపోకుండా ఉండాలంటే డబ్బులు ఇచ్చే విషయంలో తొందర పడకుండా, అన్ని విషయాలను కూలంకషంగా చర్చించి, వివరాలు తెలుసుకున్న తరువాత సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలి.



# ఆ ఊళ్లో అతనొక్కడే

ఊళ్లోకి నీరు చేరడంతో, ఊరు కనిపించకుండా పోయింది. పాతికేళ్లుగా ఈ ఊరు నీటి అడుగునే ఉంది. ఆ తర్వాత ఇక్కడ అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయి. నీరంతా ఆవిరైపోవడం 2009లో శిథిలావస్థలో ఉన్న ఊరు బయటపడింది. ఇదే ఊరికి చెందిన పాబ్లో నోవాక అనే ఈ పెద్దాయన తన ఇల్లు వెతుక్కుంటూ ఇక్కడకు చేరుకున్నాడు. ఊళ్లో ఎవరూ లేకపోయినా, అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ వస్తున్నాడు. తొంభైమూడేళ్ల పాబ్లో నోవాక్ ఒంటరిగా బతుకుతున్న సంగతి ఇటీవల మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. 'ప్రపంచంలోని అత్యంత ఒంటరి మనిషి'గా అభివర్ణిస్తూ సీఎన్ఎన్ చానల్ ఇతడిపై ఒక కథనాన్ని ప్రసారం చేయడంతో మిగిలిన చానెళ్లు, పత్రికల్లోనూ ఇతడిపై కథనాలు వెలువడ్డాయి.

**ఎవరూ** లేని ఆ ఊళ్లో అతనొక్కడే ఉంటున్నాడు. పాతికేళ్లుగా నీటమునిగిన ఆ ఊరు, తర్వాత అనావృష్టి పరిస్థితుల్లో శిథిలావస్థలో బయటపడింది. అప్పటి నుంచి ఆ పెద్దాయన ఒక్కడే ఒంటరిగా ఆ ఊళ్లో ఉంటున్నాడు. నీటమునిగి నరసంచారానికి దూరమైన ఆ ఊరి పేరు ఎపిక్యూయెన్. అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిరిస్ ప్రావిన్స్ పరిధిలోని ఊరది. ఒకప్పుడు ఆ ఊరు పర్యాటకులకు విశేషంగా ఆకర్షించేది. అప్పట్లో ఆ ఊళ్లో దాదాపు రెండువేల మంది ఉండేవారు. ఏటా ఐదువేల మందికి పైగా పర్యాటకులు వచ్చి వెళుతుండేవారు. దురదృష్టవశాత్తు ఆ ఊరికి చేరువలో ఉన్న డ్యామ్ 1985లో వచ్చిన వరదల కారణంగా ధ్వంసమైంది.




---

# హంసకారు

**ఈ** కారు అచ్చం హంసలా ఎంత వయ్యారంగా ఉందో మీరే చూడండి. ఇదేమీ సరికొత్త మోడల్ కాదు. వందేళ్ల కంటే మునుపటిది. బ్రిటిష్‌హయాం రోజుల్లో 1900 ప్రాంతంలో కోల్‌కత్తా రాబర్ట్ నికోల్ స్కాట్ మాథ్యూసన్ అనే సంపన్న స్కాటిష్ దొరగారు ఉండేవారు. ఆయనగారి ఇల్లు కోల్‌కత్తా జూ పక్కనే ఉన్న స్వాన్ పార్కుకు చేరువలో ఉండేది. స్వాన్‌పార్కులో తిరుగాడే హంసలను రోజూ గమనిస్తూ ఉండే మాథ్యూసన్ దొరగారికి తన కారును అచ్చం హంసలాగానే తయారు చేయించుకోవాలనే కోరిక పుట్టింది. మనసులో కోరిక పుట్టినదే తడవుగా ఇంగ్లండ్‌లోని కార్ల తయారీ సంస్థ జేడబ్ల్యూ బ్రూక్ అండ్ కంపెనీ వారికి 1909లో ఆర్డర్ చేసి, తన కోసం ఇలా ప్రత్యేకంగా హంసలాంటి కారును తయారు చేయించుకున్నాడు. ఈ కారు 1910లో కోల్‌కత్తా చేరుకుంది. అప్పట్లో ఈ కారులో మాథ్యూసన్ దొరగారు కలకత్తా వీధుల్లో విహరిస్తూ ఉంటే జనాలు కళ్లప్పగించి వింతగా చూస్తుండేవారు. ఈ కారుకు కొన్ని విచిత్రమైన ప్రత్యేకతలు కూడా ఉండేవి. ఇంజిన్ వేడెక్కినప్పుడు హంస మూతి నుంచి వేడినీళ్లు పిచికారీలా బయటకు వచ్చేవి. అప్పట్లో మాథ్యూసన్ ఈ కారు కోసం దాదాపు 15వేల పౌండ్లు ఖర్చు చేశాడు. మాథ్యూసన్ దీనిని ఎక్కువకాలం వాడకుండానే అమ్మేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ కారు నెదర్లాండ్‌లోని లోమన్ మ్యూజియమ్‌లో ఉంది.






# స్వప్నశయ్య

ఎవరు నువ్వు..
సొగసును ఆరబోయడానికి
ముళ్లపొదలను జయించి
ఉద్భవించిన లేత గులాబివా?
సరాగాల సౌరభాలు వినిపించడానికి..
జారిపోతూ వేలాడుతున్న
పక్షి గూటి నుండి ఊడిపడిన
ఊరపిచ్చుకవా, గోరింకవా
లేక కోకిలవా?
జాముర్రాతి జవరాలిలా
పరిమళాల విరజాజివా
సన్నజాజి మల్లెమొగ్గవా
చెంబేలివా.. సెంటుమల్లెవా..
లేక పారిజాతానివా?
అప్పనంగా మదిలో చేరి అల్లరిపెట్టే
ముద్ద మందారానివా
అల్లరిగా నవ్వే ముద్దబంతివా
రెపరెపలాడే రెక్క బంతివా?
చిట్టి చామంతివా
కొలనులోంచి కొంటెగా చూసే
కలువపువ్వువా లేక కమలానివా
కూనిరాగాలతో మొదలెట్టి
ఫిడేలు రాగాలు పలికిస్తున్న
నువ్వు నా హృదయ వీణవా
ఆత్మవా.. అంతరాత్మవా
వెన్నెల్లో ఆడపిల్లవా
అతిలోక సుందరివా
కమ్మని స్వప్నానివా
కదిలించే గమ్యానివా
కనుల ముందు రాని నువ్వు
కరుణ చూపేదెప్పుడు.. నాకు
ఈ స్వప్నశయ్య ఇంకెన్నాళ్లు?

**- న్యాలకంటి నారాయణ**

---

# సూనృతాలు

**ముక్తసరి మాటలు**
మంచి గంధపు ఊటలు
మహోద్ధతికి కట్టిన కోటలు
శ్రీ లక్ష్మీనాథా!

రక్తిలేని 'భారతం' రీతి
రసగంధం లేని కావ్యభాతి
రాజీపడని జీవన భూతి
శ్రీలక్ష్మీనాథా!

సత్కార్యాచరణం
సస్ఫూర్తికి తోరణం
సద్యోఃగతికది అనుసరణం
శ్రీలక్ష్మీనాథా!

జగడాల మారి
జిత్తుల కుమారి
జాగృతికేది దారి
శ్రీలక్ష్మీనాథా

చాంచల్య చిత్తులు
ఛాందసానికి తొత్తులు
'చెనటి'తోనా
పొత్తులు(చెనటి=కుత్సితుడు)
శ్రీలక్ష్మీనాథా
అనుక్షణికం
అనుభవ పూరకం
అనూహ్య లబ్ధికి కారకం
శ్రీలక్ష్మీనాథా!

కారణం లేని కార్యం
కదం తొక్కని శౌర్యం
క్రమబద్ధతే అనివార్యం
శ్రీలక్ష్మీనాథా!

అణుకువ పొసగిన నాట
అచ్చిక బుచ్చికలున్న చోట
అనంత తత్వానికది మేలు
బాట
శ్రీలక్ష్మీనాథా!

**- డా॥ అవనిగడ్డ సూర్యప్రకాష్**

# తాళ్ళ సూర్యుడు

**తాడు పైకి**
ఉడుత పిల్లలెక్క పాకినవాడు
చలి జ్వరం
కాళ్ళూ చేతులు కట్టిపడేసిన
శాపగ్రస్తం/ తాళ్ళ నడుమ
కుందేలు లాగా తిరిగినవాడు
కాలు కాలిన పిల్లిలా
మంచం మీద/ మలనసేమో
తాళ్ళ మీద/ పదే పదే
తాళ్ళు పిలుస్తున్న కలవరం
పదే పదే పొల మారుతున్న
సరం
తాటి వనం
గోడ దునికి వచ్చే ప్రియుడి
కోసం/ చేయి చాపి
నిలుచున్న ప్రియురాలు
తాళ్ళు
పాలు పితికే సూర్యుడి
కొరకు/ పొదుగు నిండిన
ఎదురుచూపు.

**- గజ్జెల రామకృష్ణ**





## రాజాగణేష్ నీతిపద్యాలు..'హేమాలు'

మానసికోల్లాసాన్ని రగిలిస్తు, కర్తవ్య నిర్వహణను ప్రభోదిస్తు, యువతలో వ్యక్తిత్వ నిర్మాణానికి చిట్కాలు సూచిస్తు లక్కోజు రాజాగణేష్ 'హేమాలు' పేరిట 515 నీతిపద్యాలు పొందుపరిచి అందిస్తున్నారు. యిదివరలో బాలసాహిత్యం, కథ, కవిత, శతక ప్రక్రియల్లో 8గ్రంథాలు వెలువరించిన రాజాగణేశ్ ప్రకటిస్తున్న తొమ్మిదవ పొత్తం యిది. చదువరులకు సులభమైన రీతిలో అర్థమయ్యేలా సరళభాషలో సృజించిన ఈ నాలుగుపాదాల పద్యాల చివరి పదం 'హేమా!'. అందుకే గ్రంథాన్ని 'హేమాలు' అంటున్నాడు. 'విషకీటకము చూచి వైదొలగునట్లు/ దుష్టతతికి దూరముగ చనుట మేలు', 'బతకమని దైవము మానుష జన్మనిచ్చె/ వెలగమని ఇల సిరవనరులు తెలివినిచ్చె/ శ్రీకర శుభకరము స్వీకారం చేసుకొనక/ ఆత్మహత్య పరమ పాతకము 'హేమా!' దుష్టులకు దూరంగా వుండట మేలని, ఆత్మహత్య మహాపాతకమని రాజాగణేష్ హెచ్చరిస్తున్నాడు. 'దేహపు గుండె గూటిలో ప్రాణంలా కనిపించదు గుడిలో ప్రత్యక్షదేముడు/ ఫలమును చూచిన రుచి తెలియని/ జీవితము గడచును 'హేమా!' గుడిలోని దేముడైన, కళ్లకు కనిపించే పండు అయినా కేవలం చూచినంత మాత్రాన ప్రభావం వుండదు. అనుభవానికొస్తేనేగాని దాని మహత్యం, రుచీ అందదని కవిభావం. యిలా ప్రతి పద్యంలో నీతిని ప్రభోదిస్తు చక్కటి పద్యాలను అల్లాడు లక్కోజు. అందరూ చదవదగ్గ నీతిపద్యాలు యివి. **(హేమాలు, రచన: యల్.రాజాగణేష్, వెల: రూ 150, ప్రతులకు: ఇం.నం.26-47-1, చైతన్యనగర్, పాతగాజువాక, విశాఖపట్నం)** **– రమణ వెలమకన్ని**

## డా॥మైథిలి అబ్బరాజు, 'తన్మాత్ర' కథాసంపుటి




డా॥మైథిలి అబ్బరాజు, 'తన్మాత్ర' కథాసంపుటిలోని తొలికథ 'ఆమోదితం'లోనే, 'మిత్రవింద'ను సృష్టించి చదువరులను అనూహ్యకథా కల్పనాలోకంలో విస్మయింపచేసారు. రచయిత్రి చారిత్రక స్పృహతో అద్భుతమైన కాల్పనిక వైచిత్రితో వర్తమాన ఆచరణలో కథ నడిపించారు. 'తన్మాత్ర' కథాసంపుటి శీర్షికలోని లోతైన సాహితీ సౌందర్యానుభూతి భావుకత, 19 కథలలో రచయిత్రి దర్శింపచేసారు. కొన్ని కథలలో పరోక్షంగా, రచయిత్రిని కదిలించి కరిగించిన 'మానిసి' కథనాలు, స్ఫురింపచేస్తారు. ప్రతికథ అంతర్లీనంగా అనన్య సామాన్య జీవనాంశాలను, కథారూపాలుగా ప్రతిబింబింప చేస్తున్నాయి. జగన్నాథ పండితరాయలు, విశ్వనాథ, గుణాఢ్యుడు, పోతన, విచిత్రంగా కథలలో కొలువు తీరారు. 'నెయ్యపుకినుక' వంటి పదబంధం మీద ఆ శీర్షికతో కథరాయడం, తన్మాత్ర సంపుటిలో చాలాకథలకు మాతృకలు రచయిత్రి, స్వాప్నిక భావదర్శనా ప్రతిభను ఆకట్టుకొన్న ఇతివృత్తాలే. మహాశ్వేత, క్షీరసాగరం, ద్వారబంధం, అభాస, రాజహంస, కథలకు ప్రేరణ తెలుగు కథలుగా చదివింపచేయటం, కథా రచనకు తెలుగు సాహిత్యంలో నవ్యతా పరిమళం గుబాళింప చేయడంలో డా॥మైథిలి అబ్బరాజు కృతకృత్యులయ్యారు. తెలుగు చదువరులను టైమ్‌మెషీన్‌లోకి తీసుకువెళ్లి, వాస్తవ వర్తమాన అనుభూతిని కలిగించగల కథరచన ప్రతిభతో కాలం గుర్తుండే కథలుగా 'తన్మాత్ర' ఆకట్టుకొంటోంది. **(తన్మాత్ర, డా॥మైథిలి అబ్బరాజు, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)** **– యర్రమిల్లి**

**పుస్తక సమీక్ష**

## తెలుగు సాహిత్య లోకాలోకనం

పుస్తకం హస్తభూషణమే కాదు, మస్తక భూషణం కూడా! కంప్యూటర్లు వచ్చిన కొత్తలో పుస్తకాలకు కాలం చెల్లిందని తలలు పట్టుకున్నారు. కాలక్రమాణ ఇది తప్పని రుజువుతుంది. అంతేకాదు, ఓ పది పుస్తకాలు ముందు వేసుకుని, ఏది చదవాలో ఎంపిక చేసుకునేలోపు మరో వంద అచ్చయి మనముందుకు వస్తున్నాయట! మంచి పుస్తకాలు చదవాలనే తాపత్రయం ఉండి,



ఏది మెరుగో,ఏది ఒరుగో తెలియని వారికి చీకోలు సుందరయ్య ఈ 'చదివి చూద్దాం' గొప్ప ప్రయోజనకారి అవుతుంది. కవిత్వం కథ, నవల, వ్యాసాలు, జీవిత చరిత్ర, నాటికలు, కార్టూనులు మొదలైన సాహితీప్రక్రియలన్నింటినీ రచయిత గాలించి పడపోసి చివరకు 123 వ్యాసాలను 'చదివి చూద్దాం'లో చేర్చారు. మూడు దశాబ్దాల పత్రికారంగ అనుభవం, సాహిత్య రచనల పోటీల నిర్వహణానుభవం టి.వి.రంగంలో చర్చానుభవం వీరికి బాగా కలిసి వచ్చింది. వందల పుస్తకాల పఠనాభవంతో రాసిన వ్యాసాలు. కనుక ఆణిముత్యాలనటంలో ఏమాత్రం సందేహం లేదు. ప్రముఖులైన నాటి విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, ఆరుద్ర, సినారే, దాశరథి నుండి మొదలుకొని నాయిని, ఖదీర్‌బాబు, యండమూరి లాంటి నేటి రచయితల రచనలపై విమర్శవ్యాసాలుండటం ఈ సంకలన విశేషం. తెలుగు సాహిత్యపు 'నాడి'గా చెప్పవచ్చును. **(చదివిచూద్దాం, సమీక్షావ్యాసాలు, రచన: చీకోలు సుందరయ్య, వెల: రూ 240, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకశాలలు)** **– కూర చిదంబరం**

తాపత్రయ నాటకత్రయం 'చివరకు మిగిలేది' తెలుగు నాటకం ప్రారంభమై 163 సంవత్సరాలైంది. ఎన్నో ప్రయోగాలు సంచలనాలకు తెలుగు నాటకం ఆలవాలమైంది 'సురభి' ప్రయోగాలు నేటికీ కొనసాగుతున్నాయి.

## తాపత్రయ నాటకత్రయం 'చివరకు మిగిలేది'



యూనివర్సిటీల్లో డిప్లొమో కోర్సులు సాగుతున్నాయి. ఆంధ్రనాటక కళాపరిషత్ స్థబ్దత నెలకొన్నా నంది నాటకాలు ఊపునిచ్చాయి. బళ్ళారి రాఘవ, గరికపాటి రాజారావు చట్ల శ్రీరాములు, కె.వెంకటేశ్వరరావు, సత్యానంద్, మిక్కిలిదేవి లాంటి పెద్దలు సాంఘిక నాటకం శక్తి చాటారు. ఎ.ఆర్.కృష్ణ లాంటి వారు 'మాలపల్లి' ప్రయోగం చేసారు. వియోగి (కోపల్లె విజయప్రసాద్) శ్రీరామునికి అంకితం 'చివరకు మిగిలేది' అనే నాటక సంపుటి విడుదల చేసారు. కళ్యాణయోగం, ఆడపిల్ల చివరకు మిగిలేది అనే మూడు నాటకాన్ని ఈ పుస్తకంలో ప్రచురించారు. అద్దెకున్న వ్యక్తి భాస్కర్, ఇంటి యజమాని సుబ్బారావు, అతని కూతురు మాలతి, మూడు ప్రధాన పాత్రలతో 'కళ్యాణయోగం' నాటకం సాగుతుంది. సుబ్బారావులోని కఠిన మనస్సును 'కరోనా' కాలం ఎంతో గొప్పగా మారుస్తుంది. చాలారోజులు తర్వాత ఓ నాటకం పుస్తకం పాఠకులకు, నాటక ప్రియులకు అందించడం 'వియోగి'గారి ప్రత్యేకత. **(చివరకు మిగిలేది, రచన: వియోగి, వెల: రూ 200, ప్రతులకు: టి.కె.విశాలాక్షిదేవి, ఇం.నం. 87-468, బి.క్యాంపు, కర్నూలు)** **– తంగిరాల చక్రవర్తి**



# ఎయిర్ ట్యాక్సీ!

**భారతీయ** నగరాల్లో రోజూ 10వేలకు పైగా కార్లు రోడ్ల మీదికి వస్తున్నాయి. ఇదేవేగం కొనసాగితే సమీప భవిష్యత్తులో మన రోడ్లు మరింత ఇరుకుగా మారిపోతాయి. భూగర్భం, సముద్రగర్భంలోంచి రోడ్ల వేసినా రద్దీలో మార్పు రాకపోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో రెండు నగరాలు, పట్టణాల మధ్య రవాణా విషయంలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు (ఇ ఎయిర్ ట్యాక్సీ) కీలకపాత్ర పోషించనున్నాయి. నలుగురు, ఐదుగురు ప్రయాణికులను రెండు పట్టణాల మధ్య రవాణా విషయంలో ఎలక్ట్రిక్ ఎయిర్‌ట్యాక్సీలు (ఇ ఎయిర్ ట్యాక్సీ) కీలకపాత్ర పోషించనున్నాయి. నలుగురు, ఐదుగురు ప్రయాణికులను రెండుపట్టణాల మధ్య తిప్పగలిగే చిన్నపాటి ఎయిర్‌క్రాఫ్ట్‌లను 'ఎయిర్ ట్యాక్సీలు' అంటారు. అందులోనూ బ్యాటరీతో నడిచేవి 'ఎలక్ట్రిక్ ట్యాక్సీలు'. వీటికి పెద్ద విమానాల్లా భారీ రన్‌వేల అవసరం ఉండదు.



కొద్దివసతులతోనే ఇవి ఆకాశం లోకి వెళ్తాయి, అంతే సౌకర్య వంతంగా నేలమీదికి దిగుతాయి. ప్రముఖ విమాన యాన సంస్థ ఇండిగో మాతృ సంస్థ అయిన ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్. ఇవీటోల్ అనే ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు బ్యాటరీతో పనిచేస్తాయి కాబట్టి, వాయుకాలుష్యం ఉండదు. విమానాలకు వాడే ఇంధనంతో పోలిస్తే ఎలక్ట్రిక్ బ్యాటరీల వ్యయం తక్కువ. ప్రయాణ ఖర్చు తగ్గుతాయి.

## భారతదేశంలో


ఇప్పటికైతే మనదేశంలోనే కాదు, ఎక్కడ ఎయిర్‌ట్యాక్సీ వ్యవస్థ లేదు. కాకపోతే కొన్ని దేశాలు త్వరలోనే రంగంలోకి దిగడానికి ఏర్పాట్లు చేస్తున్నాయి. నిజానికి, ఎయిర్ ట్యాక్సీలు మరీ కొత్తవేం కాదు. మనదేశంలో అహ్మదాబాద్, ముంద్రా, డామన్ దయ్యూ మధ్య పరిమిత సంఖ్యలో హెలికాప్టర్ల ద్వారా హెలీ ట్యాక్సీల సేవలు నడుస్తున్నాయి. వీటిని తంజావూరు, చెన్నై, మాల్డా, కోల్‌కతా, హుబ్బళ్లి బెంగళూరు మార్గాల్లో విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. తగినంత డిమాండ్ లేకపోవడంతో చాలా ఎలీట్యాక్సీ సంస్థలు ఇప్పటికే మూతపడ్డాయి. ఇలాంటి పరిస్థితి తలెత్తకూడదంటే ఎలక్ట్రిక్ ఎయిర్‌ట్యాక్సీల ప్రయాణ వ్యయం భరించగలిగే స్థాయిలో ఉంచాలి. తక్కువ ఖర్చులో, వెంటవెంటనే నడిచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అర్చర్ ఏవియేషన్ సంస్థ ఇప్పటికే పేర్కొంది. తమ సేవలను మూడేండ్లలో అందుబాటులో తెస్తామని ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ప్రకటించింది. ఇకపోతే, ఇవీటోల్ పేరుతో ఎయిర్ ట్యాక్సీల కోసం ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందిస్తున్నట్టు గత మార్చిలో నాటి పౌర విమానయాన కార్యదర్శి రాజీవ్ బన్సల్ వెల్లడించారు. 2027 నాటికే, మనదేశంలో ఎయిరో సంస్థ ఫ్లైబ్లేడ్ ఇండియాతో భారత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది కూడా.

రెండూ వేర్వేరు

ఎయిర్ ట్యాక్సీ వ్యవస్థ ఇప్పుడు ఉన్న పౌరవిమానయాన అవసరాలకు విభిన్నమైంది. రెండింటినీ వేర్వేరుగా చూడాలి. ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలో 30 నుంచి 33 కిలోమీటర్ల ప్రయాణానికి 100 డాలర్ల వరకు ఖర్చవుతుంది. భారతదేశంలో ఈ ఖర్చును 20 నుంచి 30 డాలర్లకు తీసుకురావాల్సి ఉంటుంది. ఇలా జరగాలంటే ఎయిర్ ట్యాక్సీల తయారీదేశీయంగానే జరగాలి. ఇక బ్యాటరీల్లో ఉపయోగించే లిథియం ఉత్పత్తి మనదేశంలో ఇంకా ప్రారంభమే కాలేదు. బ్యాటరీ ధరలు తగ్గాలంటే వాటిని స్థానికంగా తయారు చేసుకుంటేనే సాధ్యం అవుతుంది. టాటాల తరపున అగ్రటాస్, సుజికి దన్నుతో టీడీఎస్‌జీ భారత్‌లో బ్యాటరీల తయారీకి సన్నాహాలు జరుగుతున్నాయి.

# సిరుల పంట

**చాలామంది** రైతులు తోటివారు ఏం పండిస్తే అదే తామూ సాగు చేయాలనుకుంటారు. లేదంటే తమకి తెలిసిన పంటల్నే వేస్తుంటారు. అయితే మార్కెట్‌లో ఏ పంట డిమాండ్ ఆ పంటదే. ఒక్క పంటే వేస్తే ఒక్కో సీజన్‌లో దానికి రేటు పడిపోవచ్చు. అదే ఎక్కువ రకాలు సాగు చేస్తే ఒకటి కాకపోయినా ఇంకో దానిలో మంచి లాభాలే వస్తాయి కదా! అందుకే పండ్ల తోటల్లోనూ, కొబ్బరి తోటల్లోనూ ఒకట్రెండు అంతర పంటలు వేయడం చూస్తుంటాం. అర ఎకరంలో పదికి మించి పంటలు పండించడం ఎక్కడైనా చూశారా? ఏటీఎమ్ పద్ధతిలో సాగు చేసే రైతన్నల పొలాలకు వెళితే ఆ పంటల



వైవిధ్యం కనిపిస్తుంది. ఈ విధానంలో పూలు-పండ్ల జాతులు, తీగజాతులు, దుంపజాతులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కలప జాతుల్నీ కలిపి ఒకేసారి సాగు చేస్తుంటారు. ఎందుకంటే కొన్ని పంటలు నెలరోజుల్లోనే కాపుకొస్తే, మరికొన్ని రెండు నెలలకు, మరికొన్ని మూడునెలకు వస్తాయి. అలా దశలవారీగా చేతికొచ్చే పంటల్ని ఎంపిక చేసుకుని వరసక్రమంలో సాగు చేయడం ఒక పద్ధతి. వరసక్రమం లేకుండా ఖాళీ ఉన్న చోట ఏదో ఒక మొక్కని వేసి నేలని కప్పేయడం మరోవిధానం. ఎలా చేసినా నీడవల్ల తేమ ఎక్కువగా ఉంటుంది. రాలిన ఆకులు కుళ్లిపోయి భూసారాన్ని పెంచుతాయి. ఏటీఎమ్ విధానంలో సాగు చేసేవారు ముందుగా పొలం చుట్టూ ఎత్తుగా పెరిగే మొక్కజొన్న, కంది, చెరకు, జొన్న, కొర్రల వంటివి బోర్డరు పంటగా వేస్తారు. లోపల పండ్ల జాతుల్నీ లేదంటే చందనం, శ్రీగంధం, మహోగని వంటి కలప ఆధారిత మొక్కల్నీ ప్రధాన పంటగా వేస్తూ మిగతావి సాగు చేస్తారు. ఎలా చేసినా నిత్యం దిగుబడి వచ్చేలా పంటల్ని ఎంపిక చేసుకోవడం ముఖ్యం.

## తక్కువ నీళ్లు చాలు

బోర్డరు పంటల్ని నాటుకున్న తరవాత ఎత్తుగా పెరిగేవి, మధ్యస్థంగా ఎదిగేవి-వంగ, బెండ, గోరు చిక్కుడులా గుబురుగా పెరిగేవీ-సన్నగా పాకే చిక్కుడు తీగ జాతినీ అవి పాకడానికి వీలుగా మునగ, కరివేపాకు వంటివాటినీ ఎంపిక చేసుకుంటున్నారు రైతులు. ఆ పక్కనే బంతి, చామంతి, కనకాంబరం, మల్లె ఇలా సీజన్ల వారీగా నిత్యం కోతకొచ్చే పువ్వుల్నీ సాగు చేస్తున్నారు. వీటి మధ్యలోనే భూమిలో పండే ఉల్లి, అల్లం, పసుపు, వేరుసెనగలు కూడా సరైన ఎంపిక. మధ్యమధ్యలో పసుపు వేయడం వల్ల అందులోని యాంటీసెప్టిక్ గుణాలు ఎన్ని రకాల పంటలు వేసినా వాటి వేళ్లకు తెగుళ్లు ఆశించకుండా కాపాడతాయి. రకరకాల పంటలు ఉండటం వల్ల పరాగ సంపర్కం బాగా జరిగి దిగుబడి కూడా పెరుగుతుంది. నీళ్లు చాలా తక్కువగా ఉండే ప్రాంతాల్లోనైతే 'వానకు ముందు విత్తే' (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) పద్ధతిని





ఎంచుకుంటారు. వేసవిలోనే బంకమట్టి, ఇతర ఎరువులు, బూడిదపూత వేసిన విత్తనాలను నాటి పైన కాయగూరలూ, ఇతర వ్యర్థాలూ, సెనగపొట్టుతో నేలని కప్పెట్టి ఉంచుతారు. కుళ్లకుండా భూమి పొరలోనే తాజాగా ఉన్న విత్తనాలు వర్షంపడగానే మొలకెత్తుతాయి. వ్యర్థాల వల్ల ఆ భూమి తేమగా ఉంటుంది. ఆ విధానంలో నువ్వులు, ఆముదాలు, చిరుధాన్యాలు, గోరుచిక్కుడు, మొక్కజొన్న, వేరుసెనగ, గుమ్మడి, అల్లం, పసుపు వంటి వాటిని పండిస్తారు. సాగు చేసే పంటల్ని బట్టి రోజుకు రెండువేల నుంచి పదిహేను వేలదాకా సంపాదిస్తున్నారు రైతులు. కొన్నిచోట్ల రైతులు సంఘాలుగా ఏర్పడి పెద్దపెద్ద మాల్స్‌కూ, సూపర్ మార్కెట్లకూ ఏడాది పొడవునా తాజా కూరగాయలూ, పళ్లూ అందించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు.






కథ

# నక్కలో మార్పు

అనగనగా ఓ చిట్టడివి. అడవిలో ఒక చెట్టుపైన కాకి, బుజ్జి ఉడుత, చెట్టు మొదట్లో చీమల గుంపు వీళ్లంతా మంచి స్నేహితులు. కాకి ఊరంతా తిరిగి ఆహారం తెచ్చి ఉడుతకి, చెట్టు కింద ఉన్న చీమలకి ఇస్తుంది. చిట్టి ఉడుత చెట్టుపైన పండ్లు తింటూ, చీమలకి ఆహారం కిందకి వేస్తుంది. ఇదంతా జిత్తుల మారి నక్క రోజు దూరం నుండి కనిపెడుతుంది. ఒకరోజు నక్కకి ఆహారం ఎక్కడా దొరకలేదు. కాకి ఉడుత నివసించుచున్న చెట్టు దగ్గరికి వచ్చింది ఆ నక్క. అదే సమయంలో కాకి పెద్ద మాంసం ముక్క నోట కరచుకుని తెచ్చింది. నక్క తెలివిగా 'కాకి బావ! నీ అందం, నీ నున్నని శరీరం, నీ చాకచక్యం నాకు బాగా నచ్చుతుంది' అని పొగడ్తలతో ముంచెత్తింది. అలాగే నీ గొంతుక మాధుర్యం వినాలని నేను వచ్చాను అంది. అప్పుడు కాకి తెలివిగా తన నోటిలో ఉన్న మాంసం ముక్కను తన కాళ్లకింద పట్టుకుని కా..కా.. అని పాడింది. నక్క ఆశ్చర్యపోయింది. అబ్బా దీనికి ఎంత తెలివితేటలు, అదే సమయంలో బుజ్జి ఉడుత చెంగుచెంగునా గెంతుకుంటూ వచ్చి పట్టుతప్పి సరిగ్గా నక్క మీద పడింది. ఉలిక్కిపడి లేచిన నక్క, మెరుపువేగంతో ఉడుతను పట్టుకుంది. ఎంత ప్రయత్నించినా అది తప్పించుకోలేకపోయింది. అదే సమయంలో చీమల గుంపు ఒక్కసారిగా లేచి నక్క శరీరంపై దాడి చేసి ఉడుతని రక్షించాయి. జిత్తుల మారి నక్కకి దిమ్మతిరిగింది. ఆ నక్క ఒళ్లంతా దులుపుకుని, 'నన్ను క్షమించండి. మీరంతా ఇంత స్నేహంగా ఎలా కలిసిమెలిసి ఉంటున్నారు' అని అడిగింది.



మిమ్మల్ని చూసి నేను అసూయ, ఈర్ష్యపడ్డాను. మీలాగా నేను ఇతర జంతువులతో కలిసిమెలిసి ఉండడం ఎలాగో చెప్పండి.

'ఓ..అదా..ఏం లేదు నక్కబావ! ఇతరులతో నిన్ను నీవు అస్సలు పోల్చుకోకు, వాళ్లను చూసి ఈర్ష్యపడకు. నువ్వేంటో, నీ పని ఏంటో..అంతవరకే చూసుకో. ఉన్ననాడు పొంగిపోకు, లేనినాడు కుంగిపోకు. ఉన్నంతలో తృప్తిపడాలి. ముఖ్యంగా నీ జిత్తుల మారి బుద్ధి అసలు ఉండకూడదు' అని చెప్పాయి.

'భగవంతుని దృష్టిలో చీమ చాలా చిన్న ప్రాణి. అయినా దానికి ఏమాత్రం స్వార్థం లేదు. ఆహారం లభించినప్పుడు చీమలన్నీ కలిసి తింటూ ఉంటాయి. వాటిని చూసి మేమంతా మంచి స్నేహితులుగా ఉంటున్నాం' అని చెప్పాయి కాకి ఉడుత. అప్పటి నుండి నక్క కూడా ఇతరులకు చెడు చేయాలన్న లోచనలను తన మనసులోకి రానివ్వలేదు. ఇతర జంతువుల మీద మృగరాజుకు చాడీలు చెప్పడం మానుకుంది. తనకు దొరికిన ఆహారంతోనే తృప్తిగా జీవించడం ప్రారంభించింది. కొద్దిరోజుల్లోనే అడవిలో జంతువులన్నీ నక్కకి మంచి స్నేహితులుగా అయ్యాయి. నక్క కూడా ఉల్లాసంగా, ఉత్సాహంగా తయారయింది. అప్పుడు నక్కలో మార్పును చూసి బుజ్జి ఉడుత, కాకి, చీమలు ఆనందించాయి. మంచి స్నేహితులుగా కలిసిమెలిసి మెలుగుతున్నాయి.

**– బల్ల కృష్ణవేణి**



వార్త ఆదివారం


## బాలగేయం

### జొన్న రొట్టె



రొట్టెమ్మ రొట్టె
జొన్న రొట్టె
అమ్మ చేసింది
జొన్న రొట్టె
పప్పుమ్మ పప్పు
కందిపప్పు
అమ్మ చేసింది
కంది పప్పు
రొట్టెపైన పప్పు
పెట్టింది అమ్మ
చేతికి నాకు
ఇచ్చింది అమ్మ
పప్పురొట్టె
తింటుంటే రుచి
రోజు తింటే
భలే పుష్టి

**– పల్లోలి శేఖర్‌బాబు**



## హలో ఫ్రెండ్...



**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె. ప్రణవ్,** కాకినాడ


ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. టీవీ ముందు కూర్చుని తింటే అతిగా తింటారని? కారణమేంటి?

**జవాబు: ప్రణవ్!** మెదడు అన్యమనస్కంగా పని చేస్తున్నప్పుడు నోరు ఏం చేస్తుందో గుర్తించే పరిస్థితి ఉండదు. టీవీ చూస్తున్నప్పుడు వాసన, రుచి, తినే అలవాట్లు ఎలా ఉంటాయో పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది. టీవీ చూస్తున్నప్పుడు తిన్నదానితో పోలిస్తే టీవీ ముందు కూర్చున్నప్పుడు అధికంగా తింటారు. తినే ఆహారాన్ని ఆస్వాదిస్తూ రుచి మీద ఏకాగ్రత నిలిపితే చాలా తక్కువగా తింటారు. ఇందుకు కారణం త్వరగా కడుపు నిండిన భావన కలగడమే. అదే దృష్టి మీద లేకుండా టీవీ మీద పెడితే ఇతరత్రా విషయాలేమీ పట్టించుకోకుండా అధికంగా లాంగిచేస్తారు. మెదడులో తృప్తికేంద్రంలో పిలిచే హైపాథాలమస్‌లోని వెట్రామీడియల్ న్యూక్లియస్ మన శరీరానికి కడుపు నిండిందా లేదా అనే విషయంలో సూచనలు అందిస్తుంది. ఒకవేళ ఈ కేంద్రం సరైన పనితీరును ప్రదర్శించకపోతే ఆహారం తీసుకునే పద్ధతే వరిపోయి ఎక్కువెక్కువ తినేసే అవకాశం ఉంటుంది.

**- ఎస్.మణికంఠ,** కొడంగల్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ప్రాచీనకాలంలో పారాచూట్‌లను ఎందుకు ఉపయోగించేవారు?

**జవాబు: మణికంఠ!** మొట్టమొదటగా ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో ఇరు పక్షాలు పారాచూట్స్ దళాలను ఉపయోగించుకున్నాయి. భారీ స్థాయి వాహనాలు, ట్యాంకులను, సైనిక శకటాలను సైతం తమకు అవసరమైన చోట సురక్షితంగా దించుకోవడానికి వీటిని ఉపయోగించారు.





# మై'మరిపించే' ప్లాటినం నగలు

**తరిగొప్పుల విఎల్లెన్‌మూర్తి**



ఆభరణాలు అందాన్ని పెంచడంలోనే కాదు వారికి ఆర్థిక భద్రత కల్పించడంలోనూ ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. బంగారునగల విషయానికి వస్తే భారతీయ మహిళలు పెట్టుబడులు పెట్టే సమయంలో నగలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. అదే సమయంలో నగలపై భారతీయుల టేస్టు మారుతోంది. నిన్నమొన్నటి వరకు సంపన్న వర్గాలకే పరిమితమైన 'ప్లాటినం' నగలు, ఇపుడు మధ్యతరగతి భారతీయులకు సైతం అందుబాటులోకి వచ్చాయి. ప్లాటినం ధర బంగారం కంటే తక్కువగా ఉండడమే కారణం. విదేశాల్లో బాగా ప్రాచుర్యం పొందిన ప్లాటినం ఆభరణాలు నేడు దేశంలోని ప్రధాన నగరాల్లోకి ప్రవేశించాయి. ప్రధాన జ్యుయలరీ షోరూమ్‌లలో ప్లాటినం ఆభరణాల అమ్మకాలు పెరుగుతున్నాయి. పెరిగిన అమ్మకాలకు తగినట్లే కొత్తకొత్త డిజైన్లతో, వివిధ మోడల్స్‌లో ప్లాటినం నగలు షాపుల్లో కొలువు తీరుతున్నాయి. ప్లాటినం అందమైన సహజమైన గ్రే-వైట్ కలర్ మెటల్‌కు మెరుపును ఇస్తుంది. దానిలో అమర్చిన వజ్రాలు పెద్దవిగా కనిపిస్తాయి. హైపోఅలెర్జెనిక్ మెటరియల్-ఆభరణాలతో ఉపయోగించే ప్లాటినం సాధారణంగా 90నుండి 95శాతం స్వచ్ఛమైనది. చర్మ అలెర్జీలను ప్రేరేపించే చాలా తక్కువ అల్లాయ్ మెటల్‌తో ఉంటుంది. చాలా ప్లాటినం నగలలో నికెల్ ఉండదు. భారత్‌లో ప్లాటినం అమ్మకాల్లో వృద్ధి అంచనా సానుకూలంగా కనిపిస్తోంది. ప్లాటినం అమ్మకాల్లో కొనుగోలుదార్ల స్వభావాన్ని బట్టి చూస్తే ఈమధ్యకాలంలో ప్లాటినం వాడకం భారత సంస్కృతిలో భాగంగా మారుతోంది. ముఖ్యంగా యువత వారివారి జీవితంలో ముఖ్యఘట్టాలకు గుర్తుగా చేసుకునే సంబురాల్లో భాగంగా ప్లాటినం నగలను కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. వీటిలో ముఖ్యంగా ప్లాటినం లవ్ బ్యాండ్‌ల హవా ఎక్కువగా కొనసాగుతోంది. గతంలో లేనివిధంగా అనేక వెరైటీలు అందుబాటులోకి రావడం కూడా ప్లాటినం నగల అమ్మకాలు పెరిగేందుకు దోహదం చేస్తున్నాయని నగల వ్యాపారులు చెబుతున్నారు. గతంలో ప్లాటినం నగలంటే లవ్ బ్యాండ్లు, ఉంగరాలు, ఇంకా ఇతర చిన్నచిన్న నగలు మాత్రమే. ఇపుడు బంగారు నగల్లా, ప్లాటినంతో చేసిన అనేక రకాల నగలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో పట్టణ ప్రాంతాల్లోని చాలామంది యువతీయువకులు ఈ నగలు కొనడం ప్రారంభించారు. యువత బంగారం అనేదానిని ఆభరణాలుగా ధరించే విధానంగా కాకుండా మంచి ఇన్వెస్ట్మెంట్ ఆప్షన్‌గా భావిస్తున్నారు. అందుకే గోల్డ్‌బాండ్స్ వంటి ఇన్వెస్ట్మెంట్ ఆప్షన్లవైపు మొగ్గు చూపుతున్నారని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ప్లాటినం ఆభరణాల మేకింగ్ చార్జీ ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, ప్లాటినం ముక్కబంగారం కంటే చౌకగా ఉంటుంది. అందుకే బంగారానికి బదులు ప్లాటినం కొనడం మంచిదని ప్రజలు భావిస్తున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



ఇంటర్నెట్ సైతం దేశంలో ప్లాటినం నగల అమ్మకాలు పెరిగేందుకు దోహదం చేసిందని నగల వ్యాపారులు చెబుతున్నారు. నెట్ చూసి యువతీ యువకుల్లో ఎక్కువ మంది అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా ప్లాటినం నగలపై మోజు చూపుతున్నారు.

వీరంతా సరికొత్త డిజైన్లలో లభించే ప్లాటినం నగలపై ఆసక్తి చూపిస్తున్నారు. భవిష్యత్తులో ప్లాటినం నగలకు మరింత డిమాండ్ ఉంటుందని కూడా అంచనా. సాదాసీదా పూసలతో జతకట్టిన ప్లాటినం, వెండి నగలు మగువల మనసులను దోచేస్తున్నాయి. సంప్రదాయ వస్త్రధారణకు, వెస్ట్రన్‌వేర్‌కు ఇవి బాగా నప్పుతున్నాయి. అమ్మాయిలే కాకుండా అబ్బాయిలూ హాఫ్ అండ్ హాఫ్ డిజైన్‌తో చేసిన సన్నని, తేలికపాటి గొలుసులు వేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. 35-40 సంవత్సరాల మహిళలు సైతం ఇటీవల ప్లాటినం నగలపై ఆసక్తి చూపిస్తున్నారు. బంగారు నగలు పెట్టుకోవడాన్ని పెద్దగా ఇష్టపడని ఉన్నతోద్యోగులైన యువకులు సైతం సింపుల్‌గా ఉండే ప్లాటినం నగలపై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్లాటినం నగల అమ్మకాలు మరింత పుంజుకుంటాయని వ్యాపారులు భావిస్తున్నారు. ఆభరణాలపై మోజు అతివలకే కాదు పురుషులకు కూడా పెరిగిపోతోంది. నగలు ధరించి దగదగలాడిపోవాలనుకుంటున్న పురుషపుంగవులు పెరిగిపోతున్నారని, ఇలాంటివారి సంఖ్య మెట్రోనగరాల్లో మరింతగా ఉందని ప్లాటినమ్ గిల్డ్ సర్వేలో తేలింది. మగవాళ్ల ఆభరణాల కీలక మార్కెట్లలో ఒకటిగా హైదరాబాద్ నిలిచిందని ఈ సర్వే వెల్లడించింది. పురుషుల లగ్జరీ యాక్సెసరీలు, ఆభరణాలకు సంబంధించి ప్రపంచంలోనే అతిపెద్ద మూడో మార్కెట్‌గా భారత్ అవతరించిందని పేర్కొంది. చెన్నై, అహ్మదాబాద్, బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో ఈ సంస్థ సర్వేను నిర్వహించింది. పురుషుల ఆభరణాల మార్కెట్, ఆభరణాలు ధరించడం పట్ల వారి అభిరుచులు, అభిప్రాయాలు తెలుసుకునే నిమిత్తం ప్లాటినమ్ గిల్డ్ ఇంటర్నేషనల్ ఈ సర్వే నిర్వహించింది. మనదేశంలో పురుషులు ఇప్పుడు మంచి డిజైన్లతో సన్నని ప్లాటినం గొలుసుల కోసం చూస్తున్నారు. పండుగ, పెళ్లిళ్ల సీజన్లో పురుషుల ప్లాటినం ఆభరణాల విభాగం 25-30 శాతం పెరిగింది. ఉంగరాలు, కమ్మలు, గొలుసులు, గాజులు, నెక్లెస్‌లు, బ్రేస్‌లేట్స్ ఇలా రకరకాల ప్లాటినం నగలు ప్రధాన నగరాల్లోని జ్యుయలరీ షోరూమ్‌లలో లభిస్తున్నాయి.





ప్లాటినం మెటల్‌కన్నా ప్రాసెసింగ్ ఖర్చు ఎక్కువగా ఉండడంతో చాలామంది ఆర్డరు మీదే నగలు తయారు చేసి ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నారు. నిజానికి మనదేశంలో కంటే ఆఫ్రికా, రష్యా, నార్త్ అమెరికా దేశాల్లో ప్లాటినం నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. ప్లాటినం ఫ్యాక్టరీలు మాత్రం ముంబైలో ఉన్నాయి. మధ్యతరగతి, ఉన్నత-మధ్యతరగతి కుటుంబాలలో, బంగారం, వెండి వంటి విలాసవంతమైన వస్తువులను సంపద-ప్రతిష్ఠకు చిహ్నాలుగా చూస్తారు. ప్లాటినం, వైట్‌గోల్డ్, రోజ్‌గోల్డ్ మొదలైన ఆధునిక నగల డిజైన్లు మెటీరియల్స్ నేడు నగల తయారీలో ఉపయోగించబడుతున్న వాటిలో ఉన్నాయి. జెమ్స్ జ్యుయెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ప్రకారం, భారతదేశంలో ఆధునిక వస్తువుల ఆభరణాల ఎగుమతి అనూహ్యంగా పెరిగింది. వజ్రాల ఎగుమతి 211శాతం పెరిగింది. ప్లాటినం ఆభరణాలు 180శాతం, వెండి ఆభరణాలు 61శాతం పెరిగాయి. 2020 కంటే 2021లో స్టడెడ్ బంగారు ఆభరణాలు 60శాతం పెరిగాయి.



జాగ్రత్తలు

ప్లాటినం, బంగారు నగలను ధరించి వర్షంలో గనుక బయటకు వెళ్లివస్తే తిరిగి వచ్చిన వెంటనే వాటిని పొడివస్త్రంతో తుడిచి గాలికి ఆరనివ్వాలి. టిష్యూపేపర్లలో చుట్టి, నగల పెట్టెలో భద్రపరచాలి. ఎప్పుడూ పొడిగా ఉండే చోట ఈ డబ్బాను ఉంచాలి. వెండినగల విషయానికి వస్తే వర్షంతో వచ్చే చెమ్మకు కాంతి తగ్గడమే కాకుండా నల్లగా మారిపోతాయి. కప్పు నీళ్లలో చెంచా టూత్‌పేస్ట్ వేసి బాగా కలిపి, అందులో వెండి నగలను పదినిమిషాలు ఉంచాలి. తరవాత బ్రష్‌తో బాగా తోమి మంచినీటిలో కడిగి తుడిస్తే సరిపోతుంది. జాగ్రత్తగా చూసుకోకపోతే విరిగిపోవటం, గీతలు పడిపోవటం జరుగుతుంది. బ్రాస్‌లెట్లు, ఇయర్‌రింగ్స్, నెక్లెస్‌లను పెట్టుకుని తీసాక వాటికి ఏర్పాటు చేసిన బాక్సుల్లోనే పెట్టాలి. విడిగా పడేస్తే ఫోల్డయి మధ్యకు విరిగిపోయే ప్రమాదముంది.

ముఖానికి వాడే బ్యూటీక్రీమ్స్, జుట్టుకు వాడే హెర్బల్‌ప్రొడక్స్, కలరింగ్ వల్ల కూడా ఈ ఆభరణాలు తమ ప్రకాశాన్ని కోల్పోతాయి. స్విమ్మింగ్‌పూల్‌లోకి దిగినపుడు వాటర్‌లో ఉండే క్లోరిన్ వల్ల బంగారం నల్లగా మారే అవకాశం ఎక్కువ. అంతేకాదు తొందరగా తెగిపోతాయి. అందుకనే నీళ్లల్లోకి వెళుతున్నప్పుడు బంగారం ధరించకూడదు. ఇలా నల్లబడిన మీ బంగారం మెరుపు సంతరించుకోవాలంటే టూత్‌బ్రెష్‌ను సబ్బునీటిలో ముంచి నెమ్మదిగా నగలమీద రుద్దాలి. నగల మీద గ్రీజు మరకలేమైనా పడితే వాటిని ఆల్కహాల్ ఒకసారి ముంచి తీస్తే ఆ మరకలు పోతాయి. నగలను శుభ్రపరిచాక తప్పనిసరిగా ఆరబెట్టాలి. ❑

# పెళ్లిచూపుల గోల

## హాస్య కథ

గొర్రెపాటి శ్రీను

అర్ధరాత్రి పన్నెండు గంటలకు రాజలింగంకు మెలుకువ వచ్చింది. అతడ్ని మిత్రులు బొద్దుగా ఉంటాడని 'లడ్డు' అని పిలుస్తారు.

వాళ్లమ్మ మాత్రం "కన్నా..." అంటూ ప్రేమగా పిలుస్తుంది.

రాత్రి డాబా పైకి చేరాడు.

ఆరోజు పౌర్ణమి కావడంతో వెండివెన్నెల అందంగా మెరుస్తోంది.

లడ్డు... అదేనండీ మన రాజలింగం డిగ్రీ పూర్తి చేసి, ఆపై పి.జి. సైతం పూర్తి చేసి ఓ ఆఫీస్‌లో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు.

ఎర్రగళ్ల చొక్కాలో వున్నతను తన వైపు తనే చూసుకుంటూ మురిసిపోతున్నాడు. "అందంగా లేనా అసలేం బాగోలేనా?" మెల్లగా హమ్ చేస్తున్నారు.

అతని కళ్ల ముందు తను రెండు రోజుల క్రితం పెళ్లిచూపుల్లో చూసిన అమ్మాయి రూపం కదులుతోంది. 'వారెవ్వా.. భలే ఉందిరా అమ్మాయి" అనుకుంటూ సాయంత్రం ఆఫీస్ నుండి ఇంటికి నడుచుకుంటూ వస్తుంటే తండ్రి నుండి ఫోన్.

"ఆ సంబంధం కుదరదులేరా.. ఆ అమ్మాయికి నువ్వ నచ్చలేదంట.."

కాస్తంత దిగులు పడ్డాడు. ఈసారి తను అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. మరో స్పషలేంటంటే- ఈసారి ఓ సిద్ధాంతి గారిని కలిసి వేలికి ప్రత్యేకమైన రాయితో పొదిగిన ఉంగరం పెట్టుకున్నాడు.

గతంలో కూడా ఆ పెద్దాయన్ని కలిస్తే ఇచ్చిన సలహా మేరకు రత్నాలు పొదిగిన ఉంగరం వాడాడు. పెళ్లిచూపుల్లో అంతా ఓకే అయింది.

ఆ రోజు కాస్త తను కక్కుర్తి పడి మిక్చర్, లడ్డూలు, జిలేబీలు తినడంవల్ల ఆ పెళ్లిచూపులు బెడిసికొట్టాయి అని తరువాత తెలిసింది.

ఆరోజు తనలా ప్రవర్తించకపోతే తప్పకుండా సంబంధం ఖాయం అయ్యేది.

అమ్మాయి కూడా సన్నగా బాగుంది. నవ్వితే మరింత అందంగా వుంది. తను కాస్త బొద్దుగా ఉన్న మాట వాస్తవం. పెద్దవాళ్లు ఎవరో అనుకుంటే విని తనలో తనే నవ్వుకున్నాడు.

"పెళ్లయితే సన్నబడతాడులే! అమ్మాయి ఊరుకుంటుందా.. అదసలే చలాకి!"

మనం ఒకటి ఊహిస్తే దైవం ఒకటి నిర్ణయిస్తుందన్నట్లుగా రాజలింగం వాళ్ల ఇంటికి దగ్గరలోనే ఓ పది ఇళ్ల అవతల ఓ సంబంధం వచ్చింది.

అందరూ పెళ్లిచూపులకి బయలుదేరుతున్నారు.

"అమ్మా! నా బెల్ట్ కనిపించడం లేదే!"

"అక్కడే మంచంపై ఉంటుంది చూడరా!"

"లేదే.. కనిపించడం లేదు".

"లేకపోతే ఇప్పుడెలా? ఎలాగో ఒకలా సర్దుకో. అవతల వర్జ్యం వస్తుంది. క్యాబ్ కూడా వచ్చేసింది" తొందర చేస్తున్న తల్లితో-

"ఆ.. వస్తున్నా!" అంటూ జారుతున్న ప్యాంట్‌ని గట్టిగా పట్టుకుంటూ బయటకు నడిచాడు.

"రాజలింగం.." త్వరగా తండ్రి గావుకేక పెడుతుంటే "నాన్నా, నీకెన్నిసార్లు చెప్పాలి నన్ను అందరి ముందు రాజా, రాజాబాబు.. కన్నా అని పిలవమని"

"ఇదిగో నీ గోలలో పడి నీ కోసం బెల్ట్ కొందామని కూడా మర్చిపోయి పెళ్లివాళ్ల ఇంటికి వచ్చేసాం" అంటున్న తండ్రి వైపు గుర్రుగా చూశాడు.


"త్వరగా రారా.." తల్లి తొందర చేసింది.

అప్పటికే వాళ్లు క్యాబ్ దిగి పెళ్లికూతురి వాళ్ల ఇంట్లోకి వెళ్లారు.

కొడుకేం చేస్తున్నాడో అర్థం కావడంలేదు వాళ్లకి.

క్యాబ్‌లో ప్యాంట్‌కి గట్టిగా పిన్నీసు పెట్టుకుని బయటకు తొంగి చూస్తున్నాడు.

"రా..రా.." తల్లి హడావుడి చేస్తుంటే వేగంగా కారు దిగాడు.



కొత్తగా సిద్ధాంతిగారు ఇచ్చిన రింగ్‌ని ముద్దాడాడు. ఈసారి విజయం సాధిస్తామని అనుకున్నాడు.

.........

సిగ్గుతో నడుచుకుంటూ వస్తున్న అమ్మాయి వైపు చూస్తున్నాడు.

"సహజ" తన పేరు చెప్పిందా అమ్మాయి.

అంత అందమైన అమ్మాయిని చూడగానే అతని మనస్సు ఆనంద పారవశ్యం అయింది. ఆ అమ్మాయి తన వైపు చూస్తుంటే పొట్టలో కలుక్కుమంది.

గుండెల్లో కదా కలుక్కుమనాల్సింది... ఇదేంటో పొట్టలో...

కాస్త వంగి చూసుకున్నాడు.
తప్పు తనదేనని అర్థమయింది.
ప్యాంట్‌కి పెట్టుకున్న పిన్నీసు ఊడింది.
మామూలుగా ప్యాంట్‌కి బటన్ పెట్టుకుందామంటే ప్యాంట్ జారిపోయేలా ఉంది. లేవాలంటే ఇబ్బందిగా ఉంది.
అలాగని కూర్చుంటే ఊడిన పిన్నీసు గుచ్చుకుంటుంది.
"ఎలారా బాబు.." తల పట్టుకోబోయి ఆగాడు.
చిన్న ఐడియా తట్టింది మదిలో.
వెంటనే అమలు పరిచాడు.
"అమ్మాయిని ఏమైనా ప్రశ్నలడుగుతావా బాబూ?" అమ్మాయి తండ్రి అడుగుతుంటే–
"ఆ..!" అన్నాడు.
"అడుగబ్బాయ్..."
"మీరంతా ఇక్కడి నుండి వెళితే అమ్మాయితో పర్సనల్‌గా మాట్లాడాలి!"
"ఆ... అలాగే.." అంటున్న పెద్దాయన్ని అనుసరించారు అందరూ.
"రేయ్! రాజలింగం.." తండ్రేదో చెప్పబోతుంటే గుడ్లురిమి చూశాడు.
"మా అయ్యకి ఎన్ని సార్లు చెప్పినా మారదు కదా. నన్ను ఫ్యాషన్‌గా పిలవమంటే పిలవడు. అదేమంటే మా తాత పేరని నన్ను గౌరవంగా పిలుస్తున్నట్లు ఫీలవుతాడు" మనస్సులో అనుకుంటున్నట్లుగా పైకి మాట్లాడేస్తుంటే "ఏంటండీ! అందర్నీ పంపించేసి మీలో మీరే మాట్లాడుకుంటున్నారు" మెల్లగా ప్రశ్నించింది సైగ చేస్తూ సహజ.
"మీరు అన్యథా ఫీల్ అవ్వకపోతే..."
"చెప్పండి!"
"మీరోసారి కళ్లు మూసుకుంటారా?"
"అవన్నీ పెళ్లయ్యాకే" సిగ్గుపడుతూ చెప్పిందా అమ్మాయి.
"అది కాదండీ"
"మరి ఇంకేంటండీ?"
"ప్లీజ్! నా మాట విని ఒకసారి కళ్లు మూసుకోండి"
"తప్పదా..."
"తప్పదు.."
కొద్ది క్షణాల తర్వాత కళ్లు తెరిచింది.
లేచి నిలబడి ప్యాంట్‌కి పిన్నీసు పెట్టుకునేటప్పుడు అతడు పడే అవస్థని చూసి ఫక్కున నవ్వింది.
ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో "హ్హి....హ్హి.." అంటూ నవ్వుతూ తన ప్రయత్నంలో విజయం సాధించాడు.
పెళ్లిచూపులు ఎప్పటిలాగే ఢమాల్.

.........

ఈసారి పెళ్లిచూపులకి అన్ని విధాలా తయారై అంతా ప్రీ ప్లాన్‌తో వున్నాడు.
"నాన్నా! నీకు మళ్లీ చెబుతున్నా.. నన్ను అందరిలో రాజలింగం అని పిలవొద్దు. రాజాబాబు అనో, కన్నయ్య అనో ముద్దుగా పిలువ్"
"ఓ అలాగే..." అన్నాడు కాంతయ్య మెల్లగా నవ్వుకుంటూ.
పెళ్లికూతురు వాళ్ల ఇంట్లో ఎదురైన కుక్కని చూడగానే అతని గుండె జల్లుమంది.
నల్లగా వున్న ఆ కుక్కను అందరూ ప్రేమగా దగ్గరకు తీసుకుని ముద్దుల వర్షం కరిపిస్తుంటే ఒళ్లు జలదరించింది.
అంత పెద్ద కుక్కని తనెప్పుడూ చూడలేదు.
అదిగాని తన వెంట పడితే సీన్ కళ్ల ముందు కదలగా చెమట్లు పట్టసాగాయి.
"అబ్బాయి బాగున్నాడు" అంటున్నా వాళ్ల వైపు చూడలేకపోయాడు.
అమ్మాయి పేరు హర్షిణి అని తెలుసుకున్నాడు.
రెండు రోజుల తరువాత వాళ్లు కబురు చేశారు "సంబంధం ఓకే" అని.
"నాన్నా! నాకు ఈ సంబంధం వొద్దు" అన్నాడు.
"రేయ్! మంచి సంబంధంరా... కట్నం కూడా బాగా ఇస్తారు"
"అది కాదు.. నాకు ఈ సంబంధం నచ్చలేదు... అంతే!" అన్నాడు బుంగమూతి పెడుతూ!
ఆరోజు రాత్రి అతనికి కలొచ్చింది.
హర్షిణి శోభనంరోజు.. రాజా రాజా అని కలవరించడం!
వాళ్లు పెంచుకుంటున్న కుక్కపేరు కూడా రాజా కావడం.
హఠాత్తుగా మెలకువ వచ్చింది.
సాటి జంతువుల పట్ల ప్రేమగా ఉండమన్నారు. కానీ తనకంటే ఆ .....ఆపై ఆలోచించలేకపోయాడు.

.........

సిద్ధాంతి గారు గాల్లో మంత్రాలు చదువుతూ అతడిపై విభూతి చల్లుతూ... పూజలేవో చేస్తుంటే–
నిశ్శబ్దంగా వున్నాడు రాజలింగం... అదేనండీ రాజా!
"ఈసారి నీ పెళ్లి ఖాయమోయ్!"
"అంతేనంటారా గురూజీ!"
"ఓ ఐదు వేలు అక్కడ పెట్టు"
"అదేంటండీ.. ఎప్పుడూ మీరు తీసుకునేది వెయ్యే కదా!"
"ఈసారి స్పెషల్‌గా ట్రీట్ చేసి ఉంగరం ఇస్తున్నాను"
"ఐదు సార్లు ఏదేదో ఉంగరాలు ఇచ్చే బదులు ఇదే మహత్తరమైన ఉంగం ఇవ్వొచ్చు కదా? ఈపాటికి ఇద్దరు పిల్లల తండ్రినయ్యేవాడిని".
"ఆగాగు.. ఎక్కడికో వెళ్లమాక. పిల్లలు పుట్టాలంటే మరో వైపు ఉంగరం ఇవ్వాలి"
"ఆ..!"
"ఏంటోయ్! అలా మొహం పెట్టావు. నువ్వు వింటున్నది నిజమే. ఇప్పటి ఉంగరాలు పెళ్లిచూపులు విజయవంతం కావడానికి. పిల్లలు పుట్టాలంటే మరో మోడల్ రింగ్స్ ఇవ్వాలి. అదంతా శాస్త్రం"
"పిల్లలు పుట్టాలంటే ఇంకేదో చేయాలంట కదా!?"
"ఏంటి?"
"మీకెంత మంది పిల్లలు?'
"పెళ్లయితే కదా నాకు?"
"ఆ...అంటే?"
"నాకు అవతల పూజకు వేళవుతోంది. ఉంటానబ్బీ" అంటూ ఇంట్లోకి పరుగుతీశాడు యాభై యేళ్ల వైద్యనాథం.

.........

ఉసరుమంటూ ఇంటికి చేరాడు రాజలింగం.
వేలికి ఉన్న సత్తు ఉంగరాన్ని నేలకేసి కొట్టాడు.
మూడు ముక్కలైంది దానికి ఉన్న రాయి. ప్రశాంతమనిపించింది అతని హృదయం.
సరిగ్గా సాయంత్రం నాలుగున్నరప్పుడు పెళ్లిచూపుల సీన్లోకి ఎంటరయ్యాడు రాజలింగం.
హృదయంపై చేయేసుకున్నాడు.
మనస్ఫూర్తిగా దైవాన్ని... తన ఇష్టదైవం వేంకటేశ్వరుడ్ని తలచుకున్నాడు.
ఎదురుగా కూర్చున్న అమ్మాయి వైపు చూసాడు.
చిరునవ్వు నవ్వాడు.
సన్నగా నవ్వింది పారిజాత.
చేతులు కట్టుకుని అలాగే చిరునవ్వుతో అందరినీ పలకరించాడు.

**"నాన్నా! నాకు ఈ సంబంధం వొద్దు" అన్నాడు.**
**"రేయ్! మంచి సంబంధంరా... కట్నం కూడా బాగా ఇస్తారు"**
**"అది కాదు.. నాకు ఈ సంబంధం నచ్చలేదు... అంతే!" అన్నాడు రాజలింగం బుంగమూతి పెడుతూ!**



# జంతు జన్మ-మానవ జన్మ

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

జీవకోటిలో మానవ జన్మ ఎంతో శ్రేష్ఠమైనదిగా భావింపబడుతున్నది. ప్రాణులలో నరజన్మ దుర్లభమని చెప్పారు తత్వవేత్తలు. 'జన్తూనాం నరజన్మ దుర్లభమ్' అన్నారు. అతి విలువైన మానవ జన్మ మనకు లభించినా దాన్ని సద్వినియోగం చేసుకొనేవారు చాలా కొద్దిమందే వుంటారు. తన పుట్టుకను సత్కార్యాచరణ ద్వారా సార్థకం చేసుకొనేవాళ్లే ఉత్తమ మానవులు అనబడుతారు. తమ దుష్ట చేష్టలతో లోకానికి కీడు కలిగేటట్లు ప్రవర్తించేవారు అధములు. అటూ ఇటూ కాకుండా బతికేవారు మధ్యములు. మానవ జీవితంలో మృగావస్థ, మనుష్యావస్థ, దేవతావస్థ, ఈశ్వరావస్థలని నాలుగు దశలు ఉన్నాయని మళయాల స్వామీజీ చెప్పేవారు. మృగావస్థలో వున్న మనిషి ఏ జీవినీ ప్రేమించడు. మనుష్యావస్థలో వున్న మనిషి తన బంధువులను ప్రేమిస్తాడు. ఇక ఈశ్వరావస్థను చేరుకొన్న మానవుడు జంతువులనేగాక చెట్లనూ, పుట్లనూ, గుట్టలను కూడా ప్రేమిస్తాడు. మానవ జీవితానికి చరమ లక్ష్యం ఇలాంటి ఈశ్వరావస్థను పొందడమే. ఇక్కడొక చిన్న కథను చెప్పుకుందాం..

ఒకసారి జంతువులన్నీ ఒక చోట సమావేశమై, "మానవుడు మనకంటే ఏ విషయంలో గొప్ప?" బలం, ఆకారం మొదలైన అంశాలలో మానవుణ్ణి మించిన ప్రాణులు మనలోనే ఉన్నాయి కదా!" అని తర్కించుకొన్నాయట. సరే.. అవన్నీ కలిసి ఆ అడవిలోనే తపస్సు చేసుకుంటున్న ఒక సాధువు దగ్గరకు వెళ్లి తమ సందేహం తీర్చమని అర్థించాయి. అప్పుడా సాధువు "ఓ జంతువులారా! మీరు పుట్టుకతో వచ్చిన స్వభావాన్ని వదలలేరు. మానవులు అలా కాదు. వారు ప్రయత్నంలో తమలోని దుష్ట స్వభావాన్ని తొలగించుకొని మంచి స్వభావాన్ని అలవర్చుకోగలరు. తద్వారా ఆత్మోన్నతి సాధించుకోగలరు. యుక్తాయుక్త వివేకంతో ఉత్తమ జీవనం గడపగలరు. కాబట్టి మానవులు మీకంటే శ్రేష్టులుగా పరిగణింపబడతారు. అలా గాకుండా నీచమైన జీవితం గడిపే మనుజులు మీకంటే అధములే" అని చెప్పాడు.

ఇది విన్న జంతువులు మెల్లగా జారుకున్నాయట. కనుక మానవుడైనవాడు పరోపకారాది సద్గుణాలను అలవరచుకోవాలి. స్వార్థపరత్వాన్ని విడనాడాలి. త్రికరణశుద్ధి గల్గి నీతిమంతుడై జీవించాలి. ప్రతి ప్రాణిలోనూ దైవత్వం దాగివున్నది. అది మానవునిలో మరింత ప్రస్ఫుటమై భావిస్తున్నది. తనలోని దైవత్వాన్ని స్పష్టంగా వ్యక్తీకరించడమే మానవుని ముఖ్య కర్తవ్యం.

దైవ లక్షణాలు కలిగివున్నవారు ఉత్తమ స్థితిని అందుకుంటారు. అసుర లక్షణాలను అవలంబించినవారు అధోగతిని పొందుతారు. మానవుడు దైవత్వాన్ని పొందాలంటే కొన్ని ఉత్తమ ధర్మాలను పాటించాల్సి వుంది. తమ నిత్య జీవితంలో సాధ్యమైనంతవరకూ పాపంలేని పనిని సమయం తప్పకుండా శ్రద్ధతో చేయాలి.

ఇతర ప్రాణులకి క్లేశం కలిగించకూడదు. ఇతరులను కష్టపెట్టేవాడు తానూ ఎప్పుడో ఒకప్పుడు తప్పనిసరిగా కష్టపడవలసి వస్తుంది. ఎంతో మంది ఈ లోకంలో ధర్మ మార్గాన్నే అనుసరిస్తున్నారు. అధర్మ మార్గంలో లభించే పంచభక్ష్య పరమాన్నాలు భుజించి జీవించడం కంటే ధర్మ మార్గంతో వచ్చే అంబలి, గంజి తాగే జీవనమే శ్రేష్ఠతరంగా భావిస్తున్నారు. ప్రకాశంచే చీకటిని తొలగించునట్లుగా కరుణచే కాఠిన్యాన్ని, దయతో భేదబుద్ధినీ జయించాలి. నీళ్లతో నిప్పును చల్లార్చినట్లు శాంతంతో కోపాన్ని, త్యాగంతో లోభాన్నీ, శ్రద్ధతో అలసత్వాన్నీ జయించాలి. నావతో నదిని దాటినట్లుగా, విచారణ జ్ఞానంతో సంసారాన్నీ, యోగంతో మనస్సునూ, ధైర్యంతో శోకాన్నీ దాటవచ్చు. ప్రేమతో ద్వేష బుద్ధినీ, జ్ఞానంతో అజ్ఞానాన్నీ పోగొట్టుకుని మానవుడు దైవత్వం పొందాలి. ✦

---

అబ్బాయి నవ్వుతూ బాగున్నాడు. మంచి కలుపుగోలు కలిగినవాడు. కాస్త బొద్దుగా ఉన్నా ఎర్రగా ముద్దుగా ఉన్నాడు.... అని అనుకుంటున్న వాళ్ల మాటలు విని చిరునవ్వుతో సమాధానాలు ఇచ్చాడు.

"బావగారూ! ఈ సంబంధం ఇరు పక్షాలకు ఓకే. కానీ అబ్బాయివాళ్ల నాన్న ఓ చిన్న మాట అడుగుతారట. అందుకు సమ్మతమైతే వీలైనంత తొందరలో లగ్గాలు పెట్టుకోవచ్చు" అన్నాడు మధ్యవర్తి. "అలాగే..." అన్నాడు అమ్మాయి తండ్రి. "మాకు కట్నకానుకలు ఏమీ వద్దు. కానీ పెళ్లి ఘనంగా చేయండి.. అంతే" అన్నాడు కాంతయ్య మీసం మెలేస్తూ. "అలాగే" అంటున్న తండ్రి వైపు కృతజ్ఞతగా చూసింది పారిజాత. శ్రావణ మాసంలో అతని పెండ్లి ఘనంగా జరిగింది.

.........

ఈ స్వామీజీలు, బూటకపు బాబాల మాయల్లో పడి తనలా ఎంత మందో మోసపోతున్నారు... అని ఆలోచిస్తున్నాడు రాజబాబు.'

'శ్రీవారు..." అంటూ పక్కనే కదులుతున్న భార్యను దగ్గరకు తీసుకుంటూ దుప్పటి కప్పుకునే పనిలో వున్నాడు రాజబాబు.

ఇక ఆ కథపై నన్నడగకండి.... సెన్సార్‌వాళ్లు ఒప్పుకోరు! ●

జయసూర్య

# అక్షర శరధి-దాశరధి రంగాచార్య

**తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి రంగాచార్య తుపాకి చేతబట్టిన పోరాట యోధుడు దాశరథి రంగాచార్య నాటి పోరాట చరిత్రను, సామాజిక అణచివేతల, పోరాట సంఘర్షణలను సాహితీ సైనికునిగా తన నవలలలో చిత్రీకరించారు. నైజాం రాజ్యంలో నిజాం పాలనను ప్రతిఘటించే సాహిత్యాన్ని అక్షరీకరించిన అక్షరయోధుడు దాశరథి రంగాచార్య నైజాం ధిక్కార చైతన్యంతో భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటంలో స్వయంగా పాల్గొనడమే కాక, నాటి అమానుష స్థితిగతులు, రచయితగా ప్రతిబింబింపచేసారు.**

సనాతన కుటుంబంలో జన్మించినా, ప్రఖ్యాత కవి, అభ్యుదయవాది అన్న దాశరథి కృష్ణమాచార్యులు స్ఫూర్తి అందిపుచ్చుకొని రంగాచార్యులు, తన పోరు అనుభవాలను, పోరాట చరిత్రను సాహిత్యీకరించడం, తెలుగు సాహితీ చరిత్ర ప్రత్యేకంగా తెలంగాణ సీమను అపురూపంగా ప్రభావితం చేసింది. గతి తార్కిక చారిత్రక భౌతికవాద సాహిత్యాన్ని (మార్క్సిజం) తన జీవితంలో అంతర్భాగంగా జీవించిన రంగాచార్య 1938 పూర్వం నైజాం తెలంగాణ జన జీవితాన్ని 'చిల్లర దేవుళ్లు' నవలలో సాయుధ పోరాట పూర్వ రంగం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభల ప్రభావాన్ని చిత్రించారు. 1942 నుంచి పోరాట కాలంనాటి సమాజాన్ని 'మోదుగుపూలు' అనంతర పరిస్థితులు 'జనపదం' నవలలుగా రచించారు. జీవిత చరిత్రలు, అనువాద రచనలు, నాటికలు, కథలు, నవలలు, వ్యాసాలు, బాల సాహిత్యం దాదాపు అన్ని సాహితీ ప్రక్రియలలో రచనలు చేసారు. ఉర్దూ, సంస్కృత భాషా ప్రావీణ్యంగల రంగాచార్య ఉర్దూ రచయిత్రి జిలానీబాను కథల్ని అనువదించారు. భూస్వాముల దురాగతాలను తిరోగమన చర్యలను జనపదంలో నవలగా చిత్రీకరించారు. తెలంగాణ సాయుధ పోరాట కాల కథనం మోదుగుపూలు, నవలను తన ఆత్మకథగా అభివర్ణించారు.


1928 ఆగస్టు 24న జన్మించిన దాశరథి రంగాచార్య సాహిత్యం, జీవితం మిళితమై జీవించారు. పావని, రానున్నది, ఏది నిజం, మానవత, శరతల్పం, సాంఘిక నవలలు, జీవన యానం ఆత్మకథ. సాయుధ పోరాట కాలంలో ఉపాధ్యాయునిగా, గ్రంథాలయ పాలకునిగా తర్వాత సికిందరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యోగిగా రచనా వ్యాసంగం కొనసాగించారు. తెలంగాణ సాయుధ పోరాట క్రమాన్ని, ప్రాంత చారిత్రక, సామాజిక పరిణామాలను సాహిత్యంలో ప్రతిబింబింపచేసిన రంగాచార్య, తెలంగాణ సాహితీ సీమలో చెరగని ముద్రగా పేరు పొందారు.




వేదాలు అపౌరుషేయాలు, లిపిబద్ధాలు కారాదనే నిబంధన ఉండగా వాటిని తెలుగులోకి అనువదించే విప్లవాత్మక సృష్టిలో సాహిత్య చరిత్రలో స్థానం పొందారు. వేదాలను అనువదించడం, మహాభారతాన్ని సులభ వచన రచనగా వెలువరించడంతో అభినవ వ్యాసునిగా ఎన్నో సత్కారాలు వరించాయి. స్వయంగా మార్క్సిజాన్ని విశ్వసించిన రంగాచార్య వేదాల బోధనలు సమ సమాజానికి మార్గమని నమ్మినా మార్క్సును నాడు మహర్షిగా గౌరవించారు. 19వ శతాబ్దపు లక్నో నగర వేశ్యా వాటికల సంగీత, సాహిత్య, నృత్య ప్రదర్శనల సంస్కృతి ఆధారంగా రాయబడిన ఉర్దూ సాహిత్యంలోని కళాత్మక చారిత్రక రచన 'మీర్జారుస్వా ఉమ్రావ్ జాన్ ఆదా' అనే నవలను తెలుగులోకి అనువదించడం రంగాచార్య రచనా వ్యాసంగంలో విశిష్టమైంది. శ్రీ రామాయణం, భారతం సరళ వచనాలుగా వెలువరించిన రంగాచార్య, బుద్ధుడు, మహాత్ముడు రామానుజాచార్యులు జీవిత చరిత్రలు రచించారు. మానస జనరంగం, భారత సూక్తం వంటి కవిత్వ సంపుటిలు వెలువరించారు.

నల్లనాగు కథా సంకలనం, తెలుగువారికి ఉర్దూ, సంస్కృత సాహిత్యాలలో ప్రాచీన, ఆధునిక సాహితీ వైశిష్ట్యాన్ని అనువాద ప్రక్రియల ద్వారా అందించిన రచయితగా రంగాచార్య పేరు పొందారు.

కేవలం కమ్యూనిస్టు ఉద్యమ నేతగా తన జీవన సాహితీ ప్రస్థానాన్ని పరిమితం చేసుకోకుండా మరింత విస్తృతంగా సంప్రదాయ సాహిత్యపు ఆధ్యాత్మికత లోతులను తెలుగు చదువరులకు దర్శింపచేసిన దాశరథి రంగాచార్య, విశిష్ట రచయితగా గుర్తింపు పొందారు.



నగర మురికివాడలలో నివసించే పేదల జీవితాలు, వాటి చుట్టూ అల్లుకొన్న ధన రాజకీయాలను 'మాయ జలతారు' నవలలో వస్తువుగా రచించారు. 'చిల్లర దేవుళ్లు' నవల ఆంధ్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది.

1928 ఆగస్టు 24న మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరులో జన్మించిన రంగాచార్య 2015 జూన్ 8న సికిందరాబాదలో కన్ను మూసారు. 'చిల్లర దేవుళ్లు', 'మోదుగుపూలు', 'జనపదం' నవలలు ఆంగ్లంలోకి అనువాదం పొందాయి. ◆

# అహంకార మర్కటం

యామిజాల జగదీశ్

**అదొక అడవి. ఆ అడవిలో బుద్ధుడు మెల్లగా నడుచుకుంటూ పోతున్నాడు.**

**ఆయన వెనకే ఓ కోతి. చాలాసేపటి నుంచి అది ఆయన వెంటే నడుస్తోంది. కొంత దూరం వచ్చిన తరువాత బుద్ధుడు వెనక్కు తిరిగి చూసాడు.**

**కోతి ఆ క్షణంలోనే ఒక్క ఎగురు ఎగిరి ఓ చెట్టు కొమ్మ మీద కూర్చుంది.**

**అక్కడి నుంచి బుద్ధుడి వంకే చూస్తోంది.**

"ఎందుకు అలా చేస్తున్నావు?" అని అడిగాడు బుద్ధుడు.

"ఇదిగో... నువ్వెవరో నాకు తెలీదు. కానీ నన్ను చులకనగా చూడకు. నేను సామాన్యమైన దానిని కాను. నేననుకుంటే ఏదైనా చెయ్యగలను. నా నిఘంటువులో అసాధ్యమన్న మాటకు తావు లేదు. ఏదన్నా చేస్తాను. నాకు తెలియందంటూ లేదు..." అని ఏదేదో చెప్పుకుంటూ పోయింది.

"అలాగా... అయితే ఓ పందెం వేసుకుందామా?" అని అడిగాడు బుద్ధుడు.

"దానికేం.. తప్పకుండా! ఏం చెయ్యాలో చెప్పు" అని అడిగింది కోతి.

"ఇప్పుడు నేల మీద నుంచి ఎగిరి ఆ కొమ్మ మీద కూర్చున్నావు కదా. అక్కడి నుంచి దూకి నా అర చేతిలో కూర్చోవాలి. సరేనా!" అని అడిగాడు బుద్ధుడు.

"అంతేనా! నువ్వు చెప్పినట్టే నేను అరచేతిలో కూర్చుంటే కానుకగా ఏమిస్తావు?" అని అడిగింది కోతి.

"స్వర్గంలో ఉన్న చక్రవర్తిని పిలిచి నాతో ఉండమని అడిగాను. ఆ సమయంలో స్వర్గంలో ఆయన సింహాసనం ఖాళీ అవుతుంది. నువ్వు అందులో కూర్చోవాలి" అని అన్నాడు బుద్ధుడు.

"అలా కాకుండా నువ్వుగానీ ఓడిపోతే కొంత కాలం ఈ భూమ్మీద ఉండాలి. ఆ తర్వాతే నువ్వు నా దగ్గరకు రాగలవు" అని చెప్పాడు బుద్ధుడు.

కోతికి దూకం ఓ పనా? దూకడం అంటే నాకు చాలా సులభమైన పని. "ఇప్పుడే నీ అరచేతిలోకి దూకనా?" అని అడిగింది కోతి.

"సరే" అని బుద్ధుడు అర చేయి చాచాడు. ఆయన చేయి ఓ తామర ఆకంత ఉంది. కోతికి ఆ అరచేతిలో కూర్చోవడానికి వీలుగా ఉంది.

కోతి దూకడానికి సిద్ధపడింది.

అయితే ఆ క్షణంలో దానికో ఆలోచన వచ్చింది.

ఈ కొమ్మ నుంచి మరొక కొమ్మకు దూకడం అన్నది నాకు అతి మామూలు విషయం. నా ప్రతిభకు బుద్ధుడు విసిరిన సవాలు తగినదేనా? అనుకుంది. అయినా ఆయన అరచేతిలో దూకడం కన్నా పైపైకి ఎగిరి పైలోకానికి పోయి కాస్సేపు అక్కడ గడిపి కిందకు వచ్చేస్తే సరిపోతుందిగా అనుకుంది కోతి.

అయిదు నిమిషాలైనా అది దూకకపోయేసరికి బుద్ధుడు "ఏమిటి ఆలోచిస్తున్నావు?" అని అడిగాడు.



"ఏమీలేదు... ఇదిగో దూకేస్తున్నా" అంటూ అది పైపైకి ఎగురుకుంటూ పైలోకానికి పోయింది. అక్కడ అయిదు స్తంభాలు మిలమిల మెరుస్తున్నాయి. అవి ఎరుపు రంగులో ఉన్నాయి.

కోతి వాటిని చూసి "బుద్ధుడి దగ్గరకు వెళ్లి ఈ స్తంభాల గురించి చెప్తే ఆశ్చర్యపోతాడు కదా!" అనుకుంది. ఏదైనా ఒక స్తంభంలో తన గుర్తు ఉండేలా ఏదన్నా చేయాలనుకుంది. అనుకున్నదే తడవుగా కోతి ఓ స్తంభంలో ఏదో రాసింది.

ఏమిటో తెలుసా.... ఓ మహాజ్ఞాని ఇక్కడికి వచ్చి వెళ్లాడు అని రాసింది.

అక్కడి నుంచి కిందకు దూకి బుద్ధుడి అరచేతిలో కూర్చుంది. "చూసావా నా శక్తి. పై లోకంలో ఉన్న అయిదు స్తంభాలను చూసొచ్చాను" అంటూ ఓ స్తంభంపై తాను రాసిన మాటలను చెప్పింది.

"అలాగా!" అన్నాడు బుద్ధుడు.

"నీకు అనుమానమైతే నాతో అక్కడికి తీసుకుపోతాను" అంది కోతి.

"అదేమీ అక్కర్లేదని" అని, "సరేగానీ కాస్తంత కిందకు వంగి చూడు" అని అన్నాడు బుద్ధుడు.

కోతి కిందకు వంగి చూడగా అక్కడ బుద్ధుడి అరచేయి కనిపించింది. తీక్షణంగా చూసింది. బుద్ధుడి ఓ వేలిలో కోతి రాసిన మాటలు కనిపించాయి.

కోతి ఆలోచనలో పడింది. "అయితే ఆకాశంలో నేను చూసింది బుద్ధుడి వేళ్లా?" అని కోతి విస్తుపోయింది. దాంతో కోతి గర్వం అణగిపోయింది.

మన మనసే ఈ కోతి. మనసు అనేది, అహంకారం అనేది ఓ నాణానికి రెండు వైపులున్న బొమ్మా బొరుసు లాంటివే. మనసున్నంత వరకూ అహంకారం ఉంటుంది. మనసు నశిస్తేనే అహంకారం నశిస్తుంది. మనసు నశించాలని పెద్దవాళ్ల చెప్పేది ఈ అర్థంలోనే సుమా.

...........

నాకు తెలిసిన ఒకతను విసిరిన సవాల్ మరోలాంటిది. అతను ఓ కాలువ దాటుతానని పందెం కాసి దూకడానికి ప్రయత్నించి కింద పడి కాలు విరగ్గొట్టుకున్నాడు. "ఏమిట్రా? వెళ్లినప్పుడు బాగానే ఉన్నావుగా.. ఇప్పుడేమైంది?" అని అడిగాను.

"నేను పందెం కాసిన సమయం బాగా లేదు" అన్నాడు.

"ఎందుకలా అంటున్నావు?" అని అడిగాను.

"కాలువలో నీరుండగా పందెం కాసి ఉంటే బాగుండేది. కానీ నీళ్లు లేని టైమ్‌లో పందెం కాయడంతో ఈ గతి పట్టింది" అన్నాడు.

వియోగి

సింగిల్ పేజీ కథ

# ఆశల మెట్లు

**సడన్‌గా ఆ వ్యక్తి పలకరించాడు ప్రసాదును.**

**"బాగున్నావా?" అతను చాలా హుందాగా ఉన్నాడు. కోటు బూటు వేసుకుని ఉన్నాడు. వయసు దాదాపు యాభై పైన ఉంటుంది. అక్కడ రిసెప్షన్ జోరుగా జరుగుతున్నది. పాటలు మ్యూజిక్‌తో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతున్నది. పెండ్లికొడుకు, పెండ్లికూతురును చూస్తున్న ప్రసాద్ తనకు ఎదురుగా ఆ వ్యక్తి వచ్చి పలకరిస్తే ఆశ్చర్యపోయాడు.**

ప్రసాద్ సూపరెన్టెంటుగా ప్రభుత్వ ఉద్యోగం వెలగబెడుతున్నాడు. ఆఫీసులో అతన్ని అందరూ గౌరవంగా 'సార్' అని పలకరిస్తారు. సాధారణంగా అపరిచితులు ఎవరూ ఏకవచనంలో పలకరించరు.

"సారీ, మీరెవరో నాకు గుర్తు రావడం లేదు" కోపంగా అన్నాడు.

"ప్రసాద్! నన్ను కూడా మర్చిపోయావా నువ్వు?" నవ్వుతూ అన్నాడు.

ఆ నవ్వు అతని మెదడులోకి వెళ్లింది. దాదాపు ముప్పయి సంవత్సరాల కిందటి నవ్వు అది. తను గూడూరులో పని చేస్తున్నప్పుడు అతను తన కింద పనిచేసే రికార్డ్ అసిస్టెంటు.. పేరు దాసు. ఆనందం ఉప్పొంగింది.

"హాయ్! దాసు.. ఎలా వున్నావు? బాగా మారిపోయావు"

"ఏదో మీ దయవలన"

"నా దయ ఏముంది?"


"అదే.. మీ నాన్నగారు దేవుడిలా నన్ను అపాయింట్ చేయించారుగా రికార్డు క్లర్కుగా, మిమ్మల్ని క్లర్కుగా!" గుర్తు చేశాడు దాసు.

అవునవును, నాన్నగారు అప్పట్లో అంటే 1970 డి.యం.ఓ. ఆఫీసులో సూపరెన్టెంటుగా పని చేసేవాళ్లు. ఆయన పై అధికారులను తన గుప్పిట్లో పెట్టుకునేవారు రూల్సు బాగా తెలిసిన మనిషి. అడ్మినిస్ట్రేషన్‌లో చాలా చురుకైన వ్యక్తి. తను డిగ్రీ పాసై ఖాళీగా వుంటే తనను జూనియర్ క్లర్కుగా అపాయింటు చేయించి గూడూరులో వేసారు. అలాగే అప్పుడు ఎవరో బతిమాలితే ఖాళీ లేకపోయినా దాసును ఆర్‌సీగా అపాయింట్ చేయించారు. ఇంచుమించు యిద్దరూ ఒకే నెలలో గూడూరులో చేరిపోయారు. తను నెల్లూరు నుండి గూడూరుకు రోజూ వెళ్లి వచ్చేవాడు. దాసు మటుకు అక్కడే వుండిపోయేవాడు.

"ఈ అవతారం ఏంటి దాసూ?" ఎండాకాలంలో అతను వేసుకున్న సూటు బూటును ఈర్ష్యగా చూస్తూ అడిగాడు ప్రసాద్.

"అదంతా తర్వాత. ఇప్పుడెలా వున్నావు ప్రసాద్? ఇప్పుడు ప్రొఫెసర్ అయ్యావా? ఏ కాలేజీ, ఏ యూనివర్సిటీ?" అడిగాడు కుతూహలంగా.

ప్రసాద్‌కు గుర్తుకొచ్చింది. తనకు ఆంధ్రలో పీజీ సీటు రాకపోతే డొనేషన్ కట్టి



యంపీలోని విదిషాకు పోయి పీజీ చేసాడు. ఫిజిక్స్ లెక్చరర్ కావాలని తన కోరిక. అందుకని ఉద్యోగం వదులుకోవద్దని నాన్నగారు, స్నేహితులు, ఆఖరికి దాసు కూడా చెప్పినా వినకుండా చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా యిచ్చి పీజీ చదువుకున్నాడు. తను సంపాదించింది, పూర్వీకుల ఆస్తి అమ్మగా వచ్చిన డబ్బు యమ్మెస్సి డిగ్రీ కోసం ఖర్చు పెట్టాడు. కానీ తనకు కొంత అన్యాయం జరిగి థర్డ్ క్లాస్ వచ్చింది.

"లేదు.. దాసూ, నాకు లెక్చరర్ ఉద్యోగం రాలేదు" చెప్పాడు.

"మరి.. ఇప్పుడేం చేస్తున్నావు?" దాసు ప్రశ్న.

"ఎదుగూ బొదుగూ లేని ఒక డిపార్టుమెంటులో సూపరెన్టెంటుగా పని చేస్తున్నాను. నువ్వు యుడీసీనా, సూపరెన్టెంటా?" అడిగాడు ప్రసాద్ అతని కెరియర్ ఎలా ఉందో తెలుసుకుందామని.

"లేదు ప్రసాదూ.. నీ దయవలన డిప్యూటీ డైరెక్టర్‌ను నువ్వు పని చేసిన డిపార్టుమెంటులో" చెప్పాడు దాసు కోటు సరిచేసుకుంటూ.

షాక్ తిన్నాడు ప్రసాద్. తన కింద ఆర్‌సీగా పని చేసిన దాసు తనకంటే తక్కువ చదువుకున్న దాసు యిప్పుడు డిప్యూటీ డైరెక్టర్‌గా వున్నాడు. అంటే కెరియరు పరంగా తనకంటే చాలా ఎత్తులో వున్నాడు.

"నిజంగానా? మరి మన కొలీగులు కూడా...!?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రసాదు.

"ఆ.. అందరూ చాలా బాగా పైకి వచ్చి రిటైరయ్యారు. నువ్వు ఆ జాబు వదులుకోకుండా ఉంటే నా కంటే మూడేళ్ల ముందే డిప్యూటీ డైరెక్టర్ అయ్యేవాడివి. మన డిపార్టుమెంటు చాల బాగా విస్తరించింది" ఎవరో పిలిస్తే వెళ్లిపోయాడు.

ప్రసాద్ తల తిరిగింది. ఆశకు పోయి తన ఎంత నష్టపోయిందీ అర్థం చేసుకున్నాడు.

ఆశలమెట్లు జారుడు మెట్లని ప్రసాద్‌కు ఆలస్యంగా అవగాహన అయింది. ✦

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

# వరదాభయ ప్రదాయిని శ్రీబగళాముఖి

**తంత్ర** విధానంలో దశ మహావిద్యలు అని ఉన్నాయి. అవి వరుసగా.. శ్రీకాళీదేవి, శ్రీ తారాదేవి, శ్రీ షోడశీదేవి, శ్రీ భువనేశ్వరీ దేవి, శ్రీ త్రిపుర భైరవీదేవి, శ్రీ ఛిన్న మస్తాదేవి, శ్రీ ధూమావతీ దేవి, శ్రీ బగళాముఖీ దేవి, శ్రీ మాతంగీదేవి, శ్రీ కమలాత్మికాదేవి.

ఈ దేవతలను తంత్ర పూర్వక విధానంలో పూజిస్తే సకలాభీష్టాలు నెరవేరుతాయని విశ్వసిస్తారు.

వీరిలో ఎనిమిదవది విద్యాధిపతి శ్రీ బగళాముఖీ దేవి. ఈమెనే స్థంభన దేవత, పీతాంబరి అని కూడా పిలుస్తారు. ఈమె భక్తులకు శత్రువుల



మీ విజయాన్ని ప్రసాదిస్తారు అని అంటారు. ముఖ్యంగా కోర్టు కచేరీలలో విజయాన్ని ప్రసాదించడమే కాకుండా వారి అజ్ఞానాన్ని తొలగిస్తారని గ్రంథాలు తెలుపుతున్నాయి.

'బగళ' అన్న పదం 'వల్గా' అన్న పదం నుండి పుట్టిందని అంటారు. వల్గా పదానికి కట్టు, నిరోధించు, ఆపు చేయు అనే అర్థాలు ఉన్నాయి. అంటే అమ్మవారు భక్తులను కష్టాలను నిరోధించేదానిగా ప్రసిద్ధి. కాలక్రమంలో వల్గా ఉచ్చారణ దోషాల వలన బగళగా మారింది అని తెలుస్తోంది. పసుపు వర్ణ వస్త్రాలు ధరించి శోభించే శ్రీ బగళాముఖీదేవి భక్తులకు వరదాభయ ప్రదాయనిగా ప్రసిద్ధి. అమ్మవారు కొలువైన ఆలయాలు చాలా కొద్దిగా ఉన్నాయి. అష్టాదశ పీఠాలలో ఒకటిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ కామాఖ్యాదేవి ఆలయానికి (గౌహతి, అస్సాం) దగ్గరలో ఉన్నది. ఇక్కడ మన దేశంలో మరెక్కడా లేని విధంగా దశ మహా విద్యా దేవతల ఆలయాలు ఉండటం విశేషం. మిగిలిన వాటిలో పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో ఉన్నాయని తెలుస్తోంది. వీటిలో అస్సాంలోని ఆలయం తరువాత హిమాచల్‌ప్రదేశ్‌లోని బంఖండిలోని ఆలయం ప్రసిద్ధి చెందాయి. మన పొరుగు దేశం అయిన నేపాల్‌లో కూడా శ్రీ బగళాముఖీదేవి ఆలయం ఒకటి ఉన్నట్లు తెలుస్తోంది.

కొలిచినవారి కొంగు బంగారంగా భావించే శ్రీ బగళాముఖీ దేవి ఆలయం ఒకటి మన రాష్ట్రంలో కూడా ఉండటం, అది కూడా విశేష చరిత్ర కలిగిన ఆలయం కావడం చెప్పుకోవలసి అంశం.

## చందోలు

గతంలో గుంటూరు జిల్లాలో ఉండి ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్న చెందోలు గతంలో వెలనాడు, ధనదపురగా పిలవబడేది అని శాసనాధారాలు తెలుపుతున్నాయి.

చోళ రాజులలో ఒక శాఖగా పేర్కొనబడే వెలనాటి చోడుల రాజధాని గతంలో ధనదపురగా పిలవబడిన నేటి చందోలు. పన్నెండవ శతాబ్దపు కావ్యాలు ఎన్నో చందోలుని కుబేరుని పట్టణమైన అలకాపురితో పోల్చాయి. పాడిపంటలతో, స్వర్ణరాశులతో గొప్పగా ఉండేదట.

అంతకుపూర్వమే అంటే క్రీస్తు పూర్వం నుండి కృష్ణా నది తీరంలోని ఈ ప్రాంతం బౌద్ధులకు నివాసంగా ఉండేదని తెలుస్తోంది. ఈ ప్రాంతంలో అనేక బౌద్ధ స్థూపాలు, ఇతర శిల్పాలు లభించడం దీనికి నిదర్శనంగా చెప్పుకోవాలి. సమీపంలోని భట్టిప్రోలులో నేటికీ క్రీస్తుపూర్వంనాటి బౌద్ధ స్థూపాన్ని చూడవచ్చు. ఒకప్పుడు శోభాయమానంగా ఐశ్వర్యవంతంగా ఉన్న చందోలు ఇప్పుడు ఒక చిన్న ఊరు మాత్రమే. నాటి రాజుల కాలంనాటి మూడు ఆలయాలు శివాలయం, విష్ణు ఆలయం, బండలమ్మ ఆలయం నాటి గొప్పదనాన్ని తెలుపుతున్నాయి. శివాలయంలో నాటి శాసనాలను చూడవచ్చు. శ్రీ బండలమ్మనే బగళాముఖీ దేవిగా భావిస్తూ పూజిస్తున్నారు. చందోలులో అమ్మవారు కొలువు తీరడానికి సంబంధించిన గాథ.

## ఆలయ పూర్వ గాథ

గతంలో ఈ ప్రాంతం వెలనాటి చోడుల పాలనలో ఉండేది. ఆ కాలంలో స్థానికంగా ఉన్న శ్రీ లింగోద్భవ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకొన్నదట. ప్రజల కోరిక మేరకు మహారాజు ఆలయాన్ని పునరుద్ధరించడానికి నిర్ణయం చేశారు. నిపుణులైన శిల్పులను రప్పించి వారి ద్వారా సమీపంలోని కొండరాయి ఆలయ నిర్మాణానికి శ్రేష్ఠమైనదిగా ఎంపిక చేశారు. అక్కడి నుండి రాళ్లను ఎడ్ల బండ్ల మీద చందోలుకు తీసుకువస్తున్నప్పుడు ఒక ప్రదేశానికి వచ్చిన తరువాత బండ్లు హఠాత్తుగా ఆగిపోయాయట. ఎన్ని ప్రయత్నాలు చేసినా వాటిని ముందుకు కదిలించలేకపోయారట. ఏం చేయాలో పాలుపోక ఈశ్వర ప్రార్థన చేశారట. అప్పుడు ఒక సాధువు రాజాస్థానానికి వచ్చి "ఈ క్షేత్రం శ్రీ బగళాముఖిదేవివారి నివాసం. ఆమె అనుమతి లేకుండా ఏమీ చేయరాదు. దేవి ఆలయం శిథిలమై భూగర్భంలో కలిసిపోయింది. తిరిగి ఆలయం నిర్మించాలి. దానిలో అమ్మవారిని అందులో అమ్మవారిని పునః ప్రతిష్ఠించాలి" అని అన్నారు.

నీటిలో కొట్టుకుపోతున్నవానికి తగిన ఆధారం దొరికినట్లుగా భావించిన రాజు సాధువు నేతృత్వంలో బండి నుండి ఒక రాయిని తీసి అక్కడ ఉంచారట. వెంటనే ఎడ్లబండ్లన్నీ ఒక్కసారిగా కదిలాయట. దాంతో సంతోషించిన మహారాజు సాధువు సలహాతో ఆ ప్రాంతమంతా అన్వేషించగా ఆ ప్రాంతో ఒకచోట చిన్న గుంటలో నీరు ఉబుకుతోంది.

సాధువు మహారాజుతో అక్కడ తవ్వించమన్నారట. తవ్వించగా ఒక కోనేరు, పురాతన శిథిల ఆలయం, అమ్మవారి విగ్రహం కనిపించాయి.

తన భాగ్యానికి మహదానందపడిన మహారాజు ఆలయ నిర్మాణానికి కావలసిన ముహూర్త నిర్ణయం చేయమని అభ్యర్థించారు. తన మహిమ చూపి బండికి ఒక బండరాయి పెట్టిన తరువాత ఎడ్ల బండ్లు కదిలించిన తల్లిని అప్పటి నుండి భక్తులే శ్రీ బండ్లమ్మ అని భక్తితో పిలవసాగారు.

అమ్మవారి మూర్తి లభించిన కోనేరును ఒక బావిగా పునః నిర్మించి అమ్మవారి అభిషేకాలకు, ఆ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చడానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దారు. అప్పట్లో "శ్రీ బండ్లమ్మ జలాశయం" అని పిలిచేవారట. కొంత కాలానికి ఈ బావి భూగర్భంలో కలిసిపోయింది. తిరిగి స్థానిక భక్తులు రెవిన్యూ శాఖవారు కలిసి అన్వేషించి వెలికి తీసి ఇప్పుడు కనపడుతున్న బావిని తిరిగి నిర్మించారు.

స్థానికులు శ్రీవిద్యోపాసకులుగా ప్రసిద్ధి చెందిన కీర్తిశేషులు తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి ఆలయాభివృద్ధికి విశేష కృషి చేసారు. వారు అమ్మవారి మహిమలను, భక్తవత్సలతను భక్తులకు అనేకమార్లు ప్రత్యక్షంగా చూపించారట.

రెండు దశాబ్దాల క్రితం ఆలయ ముఖమండప నిర్మాణం కోసం పునాదులు తవ్వుతుండగా కొన్ని వందల సంవత్సరాల నాటివిగా పురావస్తుశాఖ నిపుణులు నిర్ధారించారు. వాటిని భద్రపరిచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో జరిగే తిరునాళ్ల సందర్భంగా అలంకరిస్తున్నారు.

## ఆలయ విశేషాలు

స్వాగత ద్వారం పైన ఎలాంటి గోపుర నిర్మాణం ఉండదు. కానీ ముఖ మండపం పైన వర్ణమయ అష్టాదశ పీఠాల అధిదేవతలను వర్ణమయ రూపాలలో చక్కగా అమర్చారు.

గర్భాలయంలో దశ మహా విద్యలలో ఎనిమిదవ విద్యా రూపమైన శ్రీ బగళాముఖీ దేవి దర్శనమిస్తారు.



కాపాల మాలాలంకృత ధారిణిగా, మకర కిరీటం ధరించి అసుర వాహనంపై ఆసీనురాలై హస్తాలలో వివిధ ఆయుధాలు, పాన పాత్ర, అభయ హస్తంతో ఉండే రూపం అమ్మవారిది. సరిగ్గా అదే రూపంలో ఇరు వైపులా సూర్యచంద్రులు, నుదిటిన మూడవ నేత్రంతో, కుడి చెవికి నాగము, కపాలం, ఎడమ చెవికి వృత్తాకారపు కర్ణాభరణం ధరించి, హస్తాలలో ఆయుధాలు, అభయ ముద్రలో ఉన్న శ్రీ బండలమ్మ రూపం శ్రీ బగళాముఖీ దేవి రూపాన్ని పోలి ఉండటం విశేషంగా చెప్పుకోవాలి. మరో రెండు విషయాలు ఈ అర్చామూర్తిలో కనపడతాయి.

అవి ఏమిటంటే శిఖ జ్వాలా రూపంలో ఉండటం; రెండవది: అమ్మవారి ఎడమ భుజం పైన లయకారకుడు లింగ రూపంలో కొలువై ఉండటం. వీటి వల్ల అమ్మవారు మరింత లోక ప్రయోజన శక్తులు కలిగి వరదాభయ ప్రదాయనిగా కొలువై ఉన్నారని అంటారు.

## విశేష పూజలు, ఉత్సవాలు

గత కొన్ని సంవత్సరాలుగా భక్తజన లోకంలో విశేష ఆదరణ పొందుతున్న శ్రీ బగళాముఖీ దేవి ఆలయంలో ప్రతిరోజూ నియమంగా నాలుగు పూజలు జరుగుతాయి.

ఉగాది, దసరా ఉత్సవాలు, వినాయక చవితి, మహాశివరాత్రి పర్వదినాల్లో విశేష పూజలు జరుపుతారు. ప్రత్యేకంగా వైశాఖ మాసంలో ఆలయ వార్షికోత్సవాలను అయిదు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. మధ్యలో అష్టమినాడు అమ్మవారి జయంతి సందర్భంగా విశేష పూజలు జరుగుతాయి. శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పాడ్యమి నుండి దశమి వరకు ప్రత్యేక అలంకరణలు, పూజలు, హోమాలు నిర్వహిస్తారు. ప్రతి అమవాస్య రోజున సాయంత్రం ఐదు గంటలకు శ్రీ బగళాముఖీ దేవి ప్రత్యేక హోమం నిర్వహిస్తారు.

అమ్మవారు భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి. ఈ కారణంగా అవివాహిత యువకుల కోసం ప్రతి శుక్రవారం, ఆడపిల్లల కోసం మంగళవారం ప్రత్యేక కళ్యాణ పూజలు నిర్వహిస్తున్నారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే అమ్మవారి దీక్ష మరో ఎత్తు. కోర్కెలు నెరవేరిన భక్తులు, మొక్కులు మొక్కుకున్న భక్తులు, అభీష్టాలు లేకుండా సంపూర్ణ భక్తి భావంతో దీక్ష తీసుకొనేవారు భక్తి భావాలతో దీక్ష పూర్తి చేసి అమ్మవారికి ఇక్కడ తమ ఇరుముడులను సమర్పించుకొంటారు.

ప్రతిరోజూ ఉదయం ఆరు నుండి మధ్యాహ్నం పన్నెండు వరకు తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు తెరచి వుండే ఆలయానికి స్థానిక, పక్క, దూర ప్రాంతాల నుండి భక్తులు వస్తుంటారు.

ఇన్ని విశేషాల సమాహారమైన శ్రీ బగళాముఖీ దేవి ఆలయంతో పాటు పురాతనమైన శ్రీ లింగోద్భవ స్వామి ఆలయం, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం కూడా చందోలులో ఉన్నాయి. చారిత్రాత్మక విశేషాలకు నిలయమైన చందోలు గుంటూరు నుండి నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్నది. వసతి సౌకర్యాలు గుంటూరు, పొన్నూరులలో లభిస్తాయి. రహదారి మార్గంలో సులభంగా చందోలు చేరుకోవచ్చు.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ముడిపడని వ్యవహారాలలో స్పష్టత ఏర్పడుతుంది. దూర ప్రాంత ప్రయాణాలు, తత్సంబంధిత వ్యవహారాలు అనాలోచిత నిర్ణయాల వల్ల ఇబ్బందులు కలిగిస్తాయి. శుభ కార్యాలను పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సంతాన యోగ క్షేమాల పైన దృష్టి కేంద్రీకరిస్తారు.

## వృషభం



అనుకూలంగా వుంటుంది. శుభ వార్తలు వింటారు. అనుకున్న విధంగా శుభ కార్యాలు పూర్తి చేస్తారు. నూతన గృహం/వాహనం కొనుగోలు చేస్తారు. స్వల్ప ధన లాభం. వ్యక్తిగత ప్రతిష్టను పెంపొందించుకోవడానికి ప్రయత్నాలు చేస్తారు. ప్రభుత్వ/ప్రైవేటు సంబంధ పెండింగ్ బిల్స్ మంజూరవుతాయి. పెట్టుబడుల విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తారు.

## మిథునం



అనుకూలమైన ఫలితాలు పొందుతారు. విందు-వినోదాల్లో చురుగ్గా పాల్గొంటారు. నూతన వస్తు, వస్త్రాలను కొనుగోలు చేస్తారు. ఆర్థికంగా చెప్పుకోదగిన ఇబ్బందులేమీ ఏర్పడవు. నూతన వ్యాపారం ప్రారంభిస్తారు. ఆరోగ్య సమస్యలు ఉంటాయి. ప్రయాణాలు, అధిక శ్రమ తప్పకపోవచ్చు. ఉపకరించే విషయాలు తెలుసుకొని లాభపడతారు. ఆహ్వానాలు అందుకుంటారు.

## కర్కాటకం



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. ముఖ్యమైన వ్యవహారాలలో నిదానం వ్యవహరించి లాభపడతారు. ఆర్థిక పరమైన సర్దుబాట్లు చేసుకోవడం కష్టతరమవుతుంది. కోపతాపాలకు దూరంగా వుండడం శ్రేయస్కరం. ముఖ్యమైన పత్రాల మీద సంతకాలు చేసే విషయంలో, ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఉద్యోగావకాశాలు కలిసివస్తాయి.

## సింహం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. పనులు నిదానంగా సాగినప్పటికీ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లదు. మనీ, రొటేషన్ వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండండి. కుటుంబంలో స్వల్ప స్పర్థలు చోటు చేసుకుంటాయి. ఉన్నతికి ఉపకరించే అంశాల పట్ల అధిక శ్రద్ధ కనబరచవలసి ఉంటుంది. రాజకీయ నాయకులతో పరిచయాలు ఏర్పడతాయి.

## కన్య



అనుకూలంగా ఉంటుంది. మిమ్మల్ని మీరు నిరూపించుకోవడానికి అవకాశాలు కలిసి వస్తాయి. విలాసవంతమైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వీసా, పాస్‌పోర్ట్ వంటి అంశాలు కలిసి వస్తాయి. ఆర్థిక విషయాల్లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. అనవసరమైన విషయాల్లో కాలయాపన చేస్తున్న ఆత్మీయులకు సరైన దారి చూపిస్తారు.

## తుల



అనుకూలమైన ఫలితాలు పొందుతారు. ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తారు. బహుముఖంగా ప్రజ్ఞా పాటవాలు కనబరుస్తారు. వృత్తి, ఉద్యోగాల పరంగా మీ స్థాయి పెంపొందుతుంది. ఆరోగ్య పరమైన జాగ్రత్తలు అవసరం. ప్రత్యర్థి వర్గం చేస్తున్న కుట్రలను భగ్నం చేస్తారు. కోర్టు వ్యవహారాలు అనుకూలం. రాజకీయ పరిచయాలు లాభిస్తాయి. కష్టమైన కార్యక్రమాలను శ్రమించి సానుకూలపరచుకుంటారు.

## వృశ్చికం



చెవి, ముక్కు, గొంతు సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొంటారు. రుణాలను చాలా వరకు తీరుస్తారు. తనఖా వస్తువులను విడిపిస్తారు. వివాదాస్పద విషయాలకు దూరంగా ఉంటే మంచిది. వ్యక్తిగత విషయంలో ఇతరుల జోక్యానికి అడ్డుకట్ట వేస్తారు. నిర్మొహమాట వైఖరి కనబరుస్తారు. మీడియా వల్ల బాధపడతారు. మీ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. శుభ కార్య చర్చలు సానుకూలపడతాయి.

## ధనుస్సు



అనుకూలంగా ఉంటుంది. ఆదాయాన్ని పెంపొందించుకునే మార్గాలను సమర్థవంతంగా చేజిక్కించుకుంటారు. కారణం లేని చికాకులు వేధిస్తాయి. మానసిక ఉల్లాసానికి ఆధ్యాత్మికత పట్ల మక్కువ చూపిస్తారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కార మార్గాలు లభిస్తాయి. సహోదర, సహోదరి వర్గంతో విభేదాలకు అవకాశం. జీవిత భాగస్వామి సలహాలను, సూచనలను ఎక్కువగా పాటిస్తారు.

## మకరం



సాధారణ ఫలితాలు గోచస్తున్నాయి. శ్రమ అధికంగా ఉంటుంది కానీ ఫలితాలు అందుకు తగిన విధంగా వుండవు. అయినప్పటికీ ఉత్సాహంగా కార్యక్రమాలను సానుకూలపరచుకుంటారు. ముఖ్యమైన ప్రతి విషయంలో జాగ్రత్తలు పాటించండి. ఆరోగ్య సమస్యలు ఉంటాయి. డ్రైవింగ్ పట్ల అప్రమత్తంగా వ్యవహరించండి. దూర ప్రాంత ప్రయాణాలు చెప్పదగినవి కావు. వృత్తి, ఉద్యోగాల్లో అనుకూల ఫలితాలుంటాయి.

## కుంభం



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. పాత సమస్యలు కొత్త కోణంలో కనిపిస్తాయి. సహనానికి పరీక్షలు ఎదురవుతాయి. ఆర్థిక స్థితిగతుల్లో చెప్పుకోదగిన ఇబ్బందులేవీ ఏర్పడవు. ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. ప్రజా సంబంధాలను మరింత వృద్ధి పరచుకుంటారు. బ్యాంక్ అకౌంట్లు ప్రారంభిస్తారు. కారణం లేని చికాకులు ప్రశాంతతను దూరం చేస్తాయి.

## మీనం



అనుకూలంగా ఉంటుంది. మీకు రావలసిన సొమ్ము చాలావరకు చేతికంది వస్తుంది. చెల్లింపులను కూడా సకాలంలో చెల్లిస్తారు. మాట మీద నిలబడే వ్యక్తిగా పేరు సంపాదిస్తారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. కుటుంబ బాధ్యతలను నెరవేర్చడంలో కృతకృత్యులవుతారు. వాయిదా పడుతున్న కోర్టు వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. వాక్చాతుర్యంతో కీలకమైన వ్యవహారాలు చక్కబరచుకుంటారు.

# ఇంటికి వాస్తుదోషాలున్నాయా?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458




పి.వీరేంద్ర – భీమిలి

ప్రశ్న: ఆర్థిక బాధలు, మానసిక బాధలూ ఎక్కువగా వున్నాయి. మా ఇంటికి ఏమైనా దోషాలుంటే చెప్పగలరు.

జవాబు: మీ ఇంటికి దక్షిణ నైరుతి వీధిపోటు వుంది. తూర్పు ఆగ్నేయం పెరిగిపోయి వుంది. ఎప్పుడైనా ఇక్కడికొచ్చినప్పుడు కలవండి. ఇటువంటి దోషాలకు వ్యక్తిగతంగానే పరిష్కారం చెప్పడం వీలవుతుంది.

అయినా కష్టాలు తప్పటంలేదు.

జవాబు: కేవలం తూర్పుకు అభిముఖంగా కూర్చుంటే సరిపోదు. మీరు కూర్చుండే స్థానం మీ గదిలో ఎటు వైపుకు ఉన్నదో అది ముఖ్యం. అలాగే ఆ గదికి వున్న తలుపునిబట్టి కూడా ఫలితాలు ఆధారపడి వుంటాయి.

## ఈ స్థలం ఎలాంటి ఫలితాలనిస్తుంది?

ఎదురుగా వీధిమెట్లు వేయండి. దానికెదురుగా (దొడ్డివైపు) మెట్లు కట్టి తలుపు పెట్టండి. అంటే ఇప్పుడున్న దొడ్డిమెట్లు, తలుపునూ కొత్తగా పెట్టనున్న తలుపుకు ఎదురుగా మార్చాలి. ఈ రెండు మార్పులు చేస్తే చాలు. మీ సమస్య చాలావరకు పరిష్కరించబడుతుంది. అలాగే ప్రతి శుక్రవారం నల్లచీమలకు పిడికెడు చక్కెర చల్లుతూ ఉండండి.

## వంటగది నిర్మించవచ్చా?

కె.మధుకర్ – కొత్తకోట

ప్రశ్న: ఉత్తరంగోడను తాకుతూ వాయవ్యం మూసివేస్తూ అక్కడ వంటగదిగానీ, బాత్‌రూమ్‌గానీ కట్టుకోవచ్చా?

జవాబు: కట్టుకోకూడదు.

## ప్లాటులో ఇల్లు కట్టవచ్చా?

ఎ.రాజ్‌కుమార్ – మహబూబ్‌నగర్

ప్రశ్న: నాకు వచ్చిన ప్లాటులో ఇల్లు కట్టుకోవచ్చా? ఏ విధంగా కట్టుకునేందుకు అవకాశం కలుగుతుంది?

జవాబు: పశ్చిమ రోడ్డు శూల మొత్తం ఇంటి ప్లాటుని మింగివేస్తున్నది. ఇల్లు కట్టుకోవడానికి అది సరైన స్థలం కాదు. మీ ప్లాటుకి దక్షిణాన వున్న స్థలంగానీ, ఇల్లుగానీ మీ పేరిట కొని తర్వాత ఇప్పుడు మీ భార్య పేరిట వున్న ప్లాటుని కూడా మీ పేరుతో మార్చుకొని ఆ మొత్తం స్థలంలో ఉత్తరాన ఎక్కువ ఖాళీ స్థలం వదిలి దక్షిణాన మీరు ఇల్లు కట్టుకోవచ్చు. ఒకవేళ మీరు కొన్నది ఖాళీ స్థలం కాక 'ఇల్లు' అయివుంటే మీరు ఆ ఇంట్లోనే వుండి ఇప్పుడు ఖాళీ స్థలానికి ప్రహరీ గోడ కట్టి కలుపుకుంటే చాలా మంచి ఫలితాలు కనిపిస్తాయి.

## కష్టాలను అధిగమించేదెలా?

సి.రామానుజన్ – కందుకూరు

ప్రశ్న: నేను ఉద్యోగం చేస్తున్న చోట నా సీటు తూర్పుకు అభిముఖంగానే ఉంది.

కె.రోహిత్ – హైదరాబాద్

ప్రశ్న: నా మిత్రుడు చూసిన స్థలానికి ఉత్తరాన వున్న రోడ్డు తూర్పుకు నేరుగా వెళ్లకుండా ప్లాటు దగ్గరే నిలిచిపోయింది. రెండవ నంబరు స్థలానికి కూడా ఫలితం చెప్పగలరు.

జవాబు: మీ మిత్రుడు ఆ స్థలాన్ని కొనకపోవటం మంచిది. రెండవ నంబరు స్థలం ఒకటవ నంబరు స్థలం కంటే మంచి ఫలితాలనిస్తుంది.

## సమస్యలకు పరిష్కారం?

బి.వాసంతి – నల్గొండ

ప్రశ్న: నా సమస్యలకు పరిష్కారం



చెప్పగలరు.

జవాబు: పశ్చిమాన వున్న మీ ఇంటి గుమ్మాన్ని, దానికెదురుగా వున్న వీధిమెట్లనూ తీసేసి గుమ్మం స్థానంలో గోడ, అవసరమైతే కిటికీ పెట్టండి. అదే గోడకు పశ్చిమ వాయవ్యంలో అదే తలుపును అమర్చి ఆ తలుపుకు

## ఎలాంటి మార్పులు చేయాలి?

కృష్ణ – గుంటూరు

ప్రశ్న: మేం తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పగలరు.

జవాబు: మీరు రెండు ప్లాన్లు పంపించారు. అందులో దేని గురించి మీరు అడిగారో స్పష్టంగా రాయలేదు. కొద్ది తేడాతో రెండూ ఒకే ఇంటివి అయ్యే అవకాశం కనిపిస్తోంది. మీరు ప్రస్తుతం వున్న బాత్ రూమ్, లెట్రిన్, ఉత్తరగోడ నానుకొని వున్న గదీ తీసివేయవలసి వుంటుంది. ఇవన్నీ నైరుతిలోగానీ, దక్షిణ కాంపౌండుగోడ నానుకొనిగానీ కట్టుకోవడం వల్ల మీకు చాలా కలిసివస్తుంది.

## అప్పులు పెరిగిపోతున్నాయి.. ఎందువల్ల?


ఎన్.కార్తికేయ – ఏలూరు

ప్రశ్న: నేను తాటాకుల ఇంట్లో ఉంటున్నాను. ఉత్తరానికి అభిముఖంగా ఉంది. అప్పులు పెరిగిపోతున్నాయి.

జవాబు: మీరు పూర్తి ఈశాన్యం మూలన ఒక మిషన్ పెట్టారు. అది అక్కడి నుండి తీసి కటింగ్ టేబుల్ పక్కగా మార్చండి. ఆ ఈశాన్య స్థలం నుండి లోపలికి వచ్చే దారిని ఏర్పాటు చేసుకోండి.

# పదరంగం-24

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. నింద (4)
4. ఔషధ ప్రమాణం, పరిమితి (3)
6. కృప (4)
8. పడమర సరిగా లేదు (3)
9. కష్టం (2)
10. శీతోష్ణ పరిస్థితి (5)
12. ఈయన మహాబలుడు (3)
13. చెదరిపోయిన పొరపొచ్చాలు (6)
15. ఒక ఈశాన్య రాష్ట్రం (3)
20. దీనిలో పడటమంటే సరైన మార్గంలోకి రావడం (2)
21. వేడుకోలు (4)
22. దీనిలో పుడక అని సామెత (3)
23. ..........పోవడమంటే దుఃఖించడం (1)
24. చాలా పెద్ద సుత్తి (3)
25. తిరగబడ్డ పద్ధతి (2)

### నిలువు

1. ఎటూ తేలని పరిస్థితి (4)
2. న్యాయస్థానాల్లో జరిగేవి (6)
3. బట్టల కొలతకు వాడే పదం (2)
4. అజ్ఞానం, వలపు (2)
5. 12 అడ్డంచే చంపబడ్డ కౌరవుడు (5)
6. స్త్రీ (3)
7. సూర్యచంద్రులకు అప్పుడప్పుడూ వచ్చేది (3)
11. సుమారు (4)
12. భయంకరం, తీవ్రం (3)
13. మునిచీకటి (3)
14. కిరాయి (2)
16. నిద్ర పుచ్చడానికి పాడేది (4)
17. పాఠశాల (2)
18. సంస్కారం, మర్యాద (3)
19. తొనలుండే ఒక పండు (3)
20. హడావిడి, తొందర అటూ ఇటూగా (3)

### పదరంగం-22 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ని1 | రీ | క్ష2 | ణ | | | వా3 | | సం4 | తా5 |
| జా | | ణ | | ము6 | సా | యి | దా | | క |
| యి | | క్ష7 | మిం | చ | | దా | | అ8 | ట్టు |
| తీ9 | క్ష10 | ణం | | కుం | | | క్తి11 | యు | |
| | వ | | పా12 | ద | ర13 | సం | | డు | |
| కా14 | వి | | శ్చా | | హ | | వి15 | జే | త16 |
| క | | అ17 | త్యు | త్సా | హం | | న | | ప్ప |
| తా18 | వి | | లు | | అ19 | పా20 | యం | | ని |
| లీ | | ఆ21 | | గీ22 | | తా | | గో23 | స |
| యం | | గం24 | ద | ర | గో | ళం | | | రి |

### పదరంగం-22కి జవాబులు పంపించినవారు

1. యం.వి.రమణకుమారి-హైదరాబాద్; 2. గణపవరపు పద్మ-హైదరాబాద్; 3.కె.కాత్యాయని, రజిత-విజయనగరం; 4. కె.గీత, సి.వాసుదేవ్-కర్నూలు; 5. ఎం.విష్ణువర్ధన్ రెడ్డి-మ్యాడంపల్లి

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,


లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.


పేరు : ........................................................................


........................................................................

ఊరు : ........................................................................

# ఈ వారం కా'ర్టూన్స్'


నా మనోభావాలు ఇంట్లో పెట్టి వచ్చాగాని
ఇప్పుడు చెప్పు ఏంటో..!!


మీరంతా విఫలమయినందున.. ఈ కేసును 'ఇన్వెస్టిగేషన్'
కోసం యూట్యూబు ఛానెల్స్‌కు బదిలీ చేస్తున్నాను..!!
- జడ్జి -


మనకో 'ఛార్టర్డ్ ఫ్లైట్' ఉండి ఉంటే
ఇన్విటేషన్స్ వచ్చి ఉండేవి కదరా..!!











జపాన్‌లోని షికోకు దీవి ఇయా లోయ ప్రాంతంలోని నగోరో గ్రామం బొమ్మల గ్రామంగా పేరు గాంచింది. ఈ ఊళ్లో ప్రజల కంటే బొమ్మలే ఎక్కువగా ఉంటాయి. ఊరి జనాభా కంటే బొమ్మలే ఎక్కువగా ఉండటంతో పర్యాటకులు ఈ బొమ్మలను చూడటానికి వస్తున్నారంటే ఇక ఆశ్చర్యమేముంది?



